


# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 24 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 71 పేజీలు : 4 వెల : రూ 3-00


# ఏపీలో మ్యాటర్, మీటర్ ఇష్యు





విజయవాడ, అక్టోబరు 23 ఆంధ్రప్రదేశ్‌లోకి ఇలా చలికాలం ఎంటర్ అవుతుంటే.. రాజకీయాల్లో అలా హీట్ పెరిగిపోతూ ఉంది. రోజుకో ఇష్యూతో ఏపీ పాలిటిక్స్ గరం గరంగా మారుతున్నాయి. నిన్నటి వరకు అసభ్య పదజాలాలతో దాడి చేసుకున్న నేతలు.. ఇప్పుడు మగతనంలోకి దిగేశారు. ఒక నేత మ్యాటర్ లేదు.. మీటర్ లేయదంటే.. మరో నేత మ్యాటర్ వీక్‌గా ఉన్నప్పుడే పబ్లిసిటీ పీక్‌గా ఉంటుదంటూ మగతనం మీద చర్చలు పెట్టేసుకుంటున్నారు. ఇలాంటి విషయాల్లో ఏదైనా సలహా కావాలంటే డాక్టర్ సమరాన్ని సంప్రదించాలంటూ ఉచిత సలహాలు కూడా ఇచ్చేసుకుంటున్నారు... ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని పరుష పదజాలంతో విమర్శించారంటూ టీడీపీ కార్యాలయాలు, పట్టాభి ఇంటిని వైసీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. పట్టాభి అరెస్టు.. కార్యాలయాలపై దాడిని నిరసిస్తూ నారా చంద్రబాబు నాయుడు 36 గంటల నిరవధిక దీక్ష చేపట్టారు. నారా లోకేష్ ప్రెస్‌మీట్ పెట్టి వడ్డీతో సహా చెల్లిస్తాం సిద్ధం ఉండండి అంటూ సవాల్ కూడా విసిరారు. దీంతో లోకేష్ లాంటి ఛాలెంజ్‌ను వేం స్వీకరించలేమని.. ముందు ఎమ్మెల్యేగా గెలిచి చూపించమని మంత్రి కొడాలి నాని కౌంటర్ ఇచ్చారు.తాజాగా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ.. లోకేష్ మగతనాన్ని టార్గెట్ చేస్తూ మ్యాటర్ లేదు.. మీటర్ లేయదని నెనెప్పుడో చెప్పానంటూ తనదైన శైలిలో విమర్శించారు. అసలు ఎలిమినేటి మాధవరెడ్డి పోలికలు ఎందుకొచ్చాయో మీ నాన్నను అడుగూ అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో వంశీ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నాయకులు ఘాటుగా స్పందించారు. రెండ్రోజులు జర్నీ చేస్తే రెండ్నెల్లు పడుకునే నువ్వు కూడా మగతనం గురించి మాట్లాడుతున్నావా అంటూ ఎద్దేవా చేశారు.అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించిన టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఉద్దేశించి శనివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మొగోడివి అవునో కాదో తెలుసుకోవాలంటే సమరం దగ్గర టెస్ట్‌కి పోవాలని.. మ్యాటర్ వీక్‌గా ఉన్నప్పుడు పబ్లిసిటీ పీక్‌గా ఉంటుందని డైలాగ్ రాసిన రైటర్ కూడా నీకు పరిచయమై.. నిన్ను చూసిన తర్వాతే ఆ డైలాగ్ రాసుంటారని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్‌ని ఇప్పుడు విమర్శిస్తున్నావని.. ఒకప్పుడు ఇదే లోకేష్, చంద్రబాబుని కలిసేందుకు ఎన్ని రోజులు పడిగాపులు కాశావో గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. పరిటాల రవి, జూనియర్ ఎన్టీఆర్‌ని అమితంగా అభిమానిస్తానని చెప్పుకునే వంశీ.. వాళ్లని భూముల విషయంలో మోసం చేయలేదా అని ప్రశ్నించారు.పశువుల డాక్టర్‌గా చదువుకున్నానన్న ఒక పశువు.. తాడేపల్లి ప్యాలెస్ పెంపుడు కుక్క చాలా పెద్ద పెద్ద మాటలు మాట్లాడాడు. ఏందో మ్యాటర్.. మీటర్.. మోటర్ గురించి మాట్లాడుతున్నాడు. నువ్వు మొగోడివి కాదని.. నీకు మగతనం లేదని బయట చెప్పుకుంటుంటే.. నువ్వు మగతనం గురించి మాట్లాడుతున్నావు.. నీలో ఉన్న లోపం గమనించకుండా ఉండేందుకు.. నువ్వు మగాడివో కాదో తెలుసుకోవాలంటే నువ్వు సమరం గారి దగ్గరికి టెస్టుకు పో.. తెలుసుకునే ప్రయత్నించే పని చెయ్.. నీకు సినిమా ఇండస్ట్రీతో పరిచయాలు ఎక్కువగా ఉన్నాయి కాబట్టే.. నిన్ను చూసే రైటర్ మ్యాటర్ వీక్ అయితే పబ్లిసిటీ పీక్ అనే డైలాగ్ రాసుంటాడు. జూనియర్ ఎన్టీఆర్, పరిటాల రవిని భూ విషయాల్లో మోసం చేసింది నువ్వు. పరిటాల రవి హత్య సమయంలో సమాచారం చేరవేసింది కూడా నువ్వే అని జనాలు అనుకుంటున్నారు.. దానికి సమాధానం చెప్పు" అంటూ టీడీపీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

# హస్తినకు ఏపీ పాలిటిక్స్

విజయవాడ, అక్టోబరు 23 ఏపీలో పొలిటికల్ వార్ సీన్ ఢిల్లీకి మారుతోంది. రెండు రోజుల పాటు పోటాపోటీ నిరసనలు చేపట్టిన వైసీపీ ,టీడీపీ నేతలు ఢిల్లీ బాటపడుతున్నారు.సోమవారం టీడీపీ అధినేత చంద్రబాబు ఢిల్లీ వెళ్లనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలవనున్నారు. ఏపీలో పరిస్థితిని ఆయనకు వివరించనున్నారు. రాష్ట్రపతితో పాటు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాలను అపాయింట్లమెంట్ల కోసం టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. ఇటు వైసీపీ నేతలు కూడా ఢిల్లీ వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. టీడీపీ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరనున్నారుఇదిలా ఉండగా, తన తల్లిని తిట్టారంటూ ఏపీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి అంటున్నారని ఇది ఎంతటి దుర్మార్గమని చంద్రబాబు అంటున్నారు. అతని రాజకీయ ప్రాపకం కోసం సాక్షాత్తూ అతని తల్లిని, చెల్లిని లాగే పరిస్థితికి వచ్చారని చంద్రబాబు మండిపడ్డారు. "పట్టాభి వీళ్ల తల్లిని తిట్టాడట! ఆ పదమే నేను ఎప్పుడూ వినలేదు. నాకు బూతులు రావు. యుక్తవయసులో రాజకీయాల్లోకి వచ్చా. అప్పటికి ఇతను బుడ్డీపాలు తాగుతుంటాడు. అలాంటిది నాపై ఏం మాట్లాడారో విన్నారా!" అంటూ చంద్రబాబు చెబుతున్నారు.పట్టాభి ఏదో అన్నారని లేనిదాన్ని సృష్టించి సీఎం జగన్ ఆయన తల్లిని కూడా తీసుకొచ్చారన్న చంద్రబాబు.. "అమ్మపై అంత మమకారం ఉందా? ఆ రోజు ఆమెను ఊరూరా తిప్పావు. ఆయనకో చెల్లి ఉంది. ఆమెను నాకు కౌంటర్‌గా జగనన్న బాణం అని ఊరూరా తిప్పారు. ఆ బాణం ఇప్పుడు ఎక్కడ తిరుగుతోంది? తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని నువ్వు నాకు నీతులు చెబుతావా? ఆరోజు జైలుకు పోతే నీ తల్లిని ఉపయోగించుకున్నావు. చెల్లిని ఉపయోగించుకున్నావు. ఎన్నికల ముందు జగన్ బాబాయి వివేకానంద రెడ్డిని నేనే చంపించానన్నారు. ఎన్నికలయ్యాక వివేకా కూతురు సీబీఐ విచారణ కావాలని కోర్టుకెళ్లి పోరాడుతుంటే వీళ్లు మాత్రం ఏం మాట్లాడడం లేదు. ఎవరు మోసగాడు? ఎవరు మోసం చేస్తున్నది?" అంటూ చంద్రబాబు వైసీపీపై తీవ్రంగా స్పందించారు.

# ఎంపీ విజయసాయిరెడ్డి ఫిర్యాదుపై స్పందించిన ఆర్‌బీఐ



అమరావతి: ఎంపీ విజయసాయిరెడ్డి ఫిర్యాదుపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్పందించింది. రఘురామకృష్ణరాజుకు సంబంధించిన ఇండ్ భారత్ థర్మల్ పవర్ లిమిటెడ్‌కు బ్యాంక్ రుణాల అవకతవకలపై విచారణ జరపాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి లేఖ రాశారు. దీనిపై స్పందించిన ఆర్‌బీఐ.. తగిన చర్యలు తీసుకుంటామంటూ విజయసాయిరెడ్డికి తెలిపింది. 2014-18 మధ్యలో పంజాబ్ కాన్సార్షియం దగ్గర రూ.826 కోట్ల రుణాలను ఇండ్ పవర్ తీసుకుంది. 2020 అక్టోబర్‌లో రుణాల స్కాంపై ఇండ్ పవర్ సంస్థకు చెందిన 11 చోట్ల సీబీఐ రెడ్స్ నిర్వహించింది.

# సోమవారం రాష్ట్రపతిని కలుస్తాం: పయ్యావుల

అమరావతి: ఈనెల 25(సోమవారం)న మధ్యాహ్నం 12.30 కి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలువనున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తెలిపారు. రాష్ట్రపతి పాలన ఆవశ్యకతను రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. వ్యవస్థలపై జరుగుతున్న దాడులు, ఆర్థిక పతనంపై రాష్ట్రపతికి నివేదిక ఇస్తామని తెలియజేశారు. నిన్న జరిగిన ఘటన ఒక పరాకాష్ట అని..పోలీస్ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ కార్యాలయంపై అధికారికంగా ఇచ్చిన ఫిర్యాదుపై ఇంతవరకూ ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదన్నారు. కేసు నమోదు చేయడానికి పోలీసులు భయపడుతున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే కమిషన్ ఏర్పాటు చేసి అన్ని సంఘటనలూ బయటికి తీస్తామని పయ్యావుల కేశవ్ అన్నారు.



# చంద్రబాబు దీక్షలపై డిక్షనరీ రాయాలి: కన్నబాబు



తాడేపల్లి: "చంద్రబాబు 36 గంటల దొంగ దీక్ష చేశారు. అసలు దీక్ష ఎందుకు చేశానా అని టీడీపీ అధ్యక్షుడికే డౌట్ వచ్చింది. ఢిల్లీ వెళ్లే టీడీపీ నేతలు రాష్ట్రపతిని ఏమని సంబోధిస్తారు" అని మంత్రి కన్నబాబు ప్రశ్నించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో కన్నబాబు మాట్లాడారు. "పార్టీ ఉందని నిరూపించుకోవడం కోసమే చంద్రబాబు దీక్ష డ్రామాలు చేస్తున్నారు. ఆయన దీక్షలపై డిక్షనరీ రాయాలి. చంద్రబాబు దీక్షపై టీడీపీ నేతలకే క్లారిటీ లేదు. చంద్రబాబు అమిత్ షా మీద రాళు వేయించారు.. సీబీఐని రాష్ట్రంలోకి రానివ్వలేదు. అలాంటి వ్యక్తి ఇప్పుడు ఢిల్లీ వెళ్లి ఏం చేస్తారు" అన్ని కన్నబాబు ప్రశ్నించారు."సీఎం జగన్‌ని సంభోదించిన పదంతోనే మీరు రాష్ట్రపతిని సంభోదించగలరా.. లోకేష్ కూడా చంద్రబాబును ఆ పదంతో పిలుస్తారా. అసలు చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి ఏం చెబుతారు. వేం బూతులు తిడితే వైఎస్ఆర్‌సీపీకి ఆగ్రహం వచ్చిందని చెబుతారా. రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అడ్డుకుంటున్నది మీరు కాదా" అని కన్నబాబు ప్రశ్నించారు.

# అధికారంలోకి వచ్చాక జగన్ ఇంటి నుంచి కదలట్లేదు: సోము

బద్వేలు: ఏపీలో ప్రతివక్ష నేతగా పాదయాత్ర చేసిన జగన్ అధికారంలోకి వచ్చాక ఇంటి నుంచి బయటకు రావట్లేదని ఏపీ భాజపా అధ్యక్షుడు సోము వీర్రాజు ఆరోపించారు. కడప జిల్లా బద్వేల్‌లో ఉప ఎన్నిక ప్రచారం నిర్వహిస్తున్న ఆయన.. వైకాపా నేతలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. బద్వేలులో భూకబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. వైకాపా నేతలు సామాన్యుల స్థలాలనూ వదలట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాకు గురైన బాధితులు నిన్న ఆత్మహత్యాయత్నం చేశారని వాపోయారు.



పల్లెల్లో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని సోము వీర్రాజుమండిపడ్డారు. ఆయన ఆధ్వర్యంలో బద్వేలు త్యాగరాజుకాలనీలో వైకాపాకు చెందిన 150 మంది కార్యకర్తలు భాజపాలో చేరారు. మరోవైపు బద్వేలు ఉప ఎన్నిక ప్రచారంలో కేంద్ర సమాచార సహాయ మంత్రి మురుగన్, సోము వీర్రాజుతో కలిసి రోడ్ షో నిర్వహిస్తున్నారు.


# అభివృద్ధికి నూతన నమూనా గోవా : మోదీ



న్యూఢిల్లీ : అభివృద్ధికి నూతన నమూనా గోవా అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ నేతృత్వంలో రాష్ట్రం చాలా చురుగ్గా కేంద్ర ప్రభుత్వ పథకాలను అమలు చేస్తోందన్నారు. స్వయం సమృద్ధ భారత్‌కు అవసరమైనవన్నీ గోవాకు ఉన్నాయన్నారు. ఆత్మనిర్భర్ భారత్ స్వయంపూర్ణ గోవా లబ్ధిదారులతో వర్చువల్ సమావేశంలో శనివారం మోదీ మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్ స్వయంపూర్ణ గోవా పథకం గురించి వివరిస్తూ, స్వయం సమృద్ధ భారత్‌కు అవసరమైనవన్నీ గోవాకు ఉన్నాయన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉండటం వల్లే ఇది సాధ్యమైందన్నారు. కేంద్రంలోనూ, గోవాలోనూ బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వాలు ఉన్న విషయాన్ని పరోక్షంగా గుర్తు చేశారు. స్వయంపూర్ణ పథకానికి ఉండే అతి పెద్ద బలాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ ఒకటని చెప్పారు. ముఖ్యంగా చేపల ప్రాసెసింగ్ రంగంలో గోవా దేశానికి ప్రధాన కేంద్రంగా మారే అవకాశం ఉందన్నారు. భారత దేశ చేపలను తూర్పు ఆసియా దేశాల్లో ప్రాసెస్ చేసిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లకు పంపుతారన్నారు. దీనిని మార్చడం కోసం తొలిసారి మత్స్య పరిశ్రమ రంగానికి భారీ స్థాయిలో సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నామని, దీనివల్ల రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి గత ప్రభుత్వాలు చేసిన ఖర్చుతో పోల్చుకుంటే ఐదు రెట్లు పెంచినట్లు చెప్పారు. స్వయంపూర్ణ పథకం 2020 అక్టోబరు 1న ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ అధికారి స్వయంపూర్ణ మిత్రగా వ్యవహరిస్తూ పంచాయతీలు, మునిసిపాలిటీల్లో పర్యటిస్తారు. వివిధ ప్రభుత్వ పథకాల గురించి అర్హులకు తెలియజేసి, తద్వారా వారు ప్రయోజనం పొందే విధంగా ప్రోత్సహిస్తారు.

# కశ్మీర్ అభివృద్ధిపై షా సమీక్ష

శ్రీనగర్, అక్టోబరు 23 కేంద్రం హోం మంత్రి అమిత్?షా జమ్ముకశ్మీర్?లో పర్యటిస్తున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన శ్రీనగర్ చేరుకున్నారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత హోంమంత్రి మొదటి సారిగా అక్కడ ప్రర్యటిస్తున్నారు. జమ్ముకశ్మీర్‌కు కల్పిస్తున్న ప్రత్యేక హోదాను 2019 ఆగస్టు 5న రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం లడఖ్, జమ్ము అండ్ కశ్మీర్‌లను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేసింది. శ్రీనగర్ నుంచి షార్జాకు తొలి అంతర్జాతీయ విమాన సేవలు ప్రారంభం అవుతున్న వేళ అమిత్ షా.. కశ్మీర్ లోయలో పర్యటిస్తున్నారు. అమిత్?షా భద్రత, శ్రీనగర్ అభివృద్ధిపైన వీూక్షంచనున్నారు.



అనంతరం పార్టీ ర్యాలీలో పాల్గొనున్నారు. 26 మంది ఖైదీలను జమ్మూకాశ్మీర్ జైలు నుంచి ఆగ్ర సెంట్రల్ జైలుకు తరలించారు. హోం మంత్రి పర్యటనకు ముందు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మధ్య కాలంలో జమ్ములో ఇతర ప్రాంతాల వారిని హత్య చేస్తున్నారు. అమాయక పౌరులను టార్గెట్ చేస్తున్న ముష్కరులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. ఈ నేపథ్యంలో అమిత్ షా అక్కడ పర్యటనకు వెళ్లడంతో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అలాగే షేరీ కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ూఐఎఅఅ)కి వెళ్లే అన్ని మార్గాలను భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. అమిత్ షా ఎస్‌కేఐసీసీలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారని తెలుస్తోంది.


# ఏపీలో కొత్తగా 396 కరోనా కేసులు



అమరావతి: రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై అధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేసారు. ఏపీలో కొత్తగా 396 కరోనా కేసులు నమోదయ్యాయి. తాజాగా కరోనాతో ఆరుగురు మృతి చెందారు. ఇప్పటివరకు ఏపీలో మొత్తం 20,63,177 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనాతో మొత్తం 14,339 మంది మరణించారు. ఏపీలో 5,222 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా నుంచి 20,43,616 మంది రికవరీ చెందారు.

# పట్టాభికి బెయిల్

అమరావతి: టీడీపీ నేత పట్టాభికి బెయిల్ మంజూరైంది. ఈ రోజు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు పట్టాభికి బెయిల్ ఇచ్చింది. సెక్షన్ 41 ఏ నోటీసులపై పోలీసులు కింది కోర్టు సూచనలను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. సీఎం జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని పట్టాభిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం జగన్‌పై పరుష పదజాలం ఉపయోగించినందుకు పట్టాభిపై క్రైం నం.352/2021తో ఐపీసీ 153(ఎం), 505(2), 353, 504 రెడ్‌విత్ 120(బి) సెక్షన్ల కింద గవర్నరుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం పట్టాభి రాజమండ్రి కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పట్టాభికి బెయిల్ రావడంపై టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# సంపాదకీయం

ఆదివారం 24 అక్టోబరు 2021

## మార్పుల దిశగా సమాచార హక్కు చట్టం

భారతదేశంలో సమాచార హక్కు చట్టం 2005 అమల్లోకి రావడం వెనుక మేధావుల సైద్ధాంతిక దార్శనికతలు, స్వచ్ఛంద సంస్థల జనజాగృతులు, ప్రజల వీరోచిత పోరాటోద్యమాల నిర్విరామ కృషి ఎంతగానో ఉంది. ఇంగ్లాండ్‌లో రాజరికానికి, నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా నాటి ప్రజలు ఉద్యమించి 15 జూన్, 1215 నాడు మాగ్నాకార్టాను అమల్లోకి తీసుకురావడంలో నిర్విరామ కృషి చేశారు. ఫలితంగా మాగ్నాకార్టా ప్రపంచ వ్యాప్తంగా రాజ్యాంగాలలో మానవ హక్కులకు పెద్దపీట వేసి ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఏర్పడడానికి బలమైన పునాదికి నాంది పలికింది. పరిణామక్రమంలో 1 మే, 1990 లో రాజస్థాన్‌లో ప్రముఖ మాజీ ఐఎఎస్ అధికారిణి అరుణారాయ్ 'మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్' అనే సంస్థను స్థాపించి భారతదేశంలో సమాచార హక్కు చట్టం అమలుకు ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని ప్రజ్వలింప చేశారు. మాగ్నాకార్టా మానవ హక్కులకు, ప్రజాస్వామ్య ప్రభుత్వాలకు బలమైన పునాది వేస్తే, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ సంస్థ సమాచార హక్కు చట్టం అమలుకు ప్రధాన భూమికను వహించింది. పరిపాలనలో పారదర్శకతకు పెద్దపీట వేయడం, ప్రభుత్వ శాఖలో అవినీతిని అరికట్టడం, ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థలు ప్రజలకు జవాబుదారీగా పనిచేయడం అంతిమంగా ప్రజలకు సుపరిపాలన అందించడం ముఖ్య ఉద్దేశాలుగా 12 అక్టోబర్ 2005 న జమ్ముకశ్మీర్ మినహా భారతదేశంలో సమాచార హక్కు చట్టం 2005 అమల్లోకి వచ్చింది. ఈ రకంగా భారతదేశంలో సమాచార హక్కు చట్టం 2005 అమల్లోకి వచ్చి 11 సంవత్సరాలు గడిచినా పూర్తి స్థాయిలో ఆశించిన సత్ఫలితాలను పొందలేకపోవడం విచారకరం. దీనికి కారణాలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వాలు, సమాచార కమిషన్‌లు ఈ క్రింది సంస్కరణలను విధిగా అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమాచార హక్కు చట్టం 2005 అమల్లోకి వచ్చి 16 సం?లు గడిచినా ఇంకా దేశ వ్యాప్తంగా కొద్దిమంది మినహా అత్యధిక ప్రజానీకానికి ఆ చట్టంపై పూర్తి స్థాయి అవగాహన లేదు. అందుకు ప్రభుత్వాల ప్రచార వైఫల్యాలు చాలా స్పష్టంగా కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టం 2005 నేపథ్యం, ఉద్దేశాలు, లక్ష్యాలు, విధి విధానాలు తీరుతెన్నులు, దరఖాస్తులు చేయు పద్ధతులు, అప్పీల్‌లు చేయు విధానాలు సమాచారం ఇవ్వని అధికారులకు జరిమానాలు విధించడం, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం మొదలైన అంశాలకు సంబంధించి ప్రజా సమాచార మాధ్యమాల ద్వారా తరచూ విస్తృత స్థాయిలో ప్రసారాలు చేయాలి. సమాచార హక్కు చట్టంపై సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తూ నూతన సమాజ ఆవిష్కరణకు దోహదపడుతున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వాలు విధిగా ఆర్థిక సహాయ సహకారాలను అందించాలి. ప్రభుత్వ సంస్థలు ముఖ్యంగా సమాచార హక్కు చట్టంపై పూర్తిస్థాయి అవగాహన ఉన్న వారిని మాత్రమే ప్రజా సమాచార అధికారులుగా, అప్పిలేట్ అధికారులుగా నియమించాలి. అవగాహన లేని అధికారులకు విధిగా తగిన శిక్షణ ద్వారా పూర్తి స్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహనను కల్గించాలి. 'మండల స్థాయిలో రూ. 5లను రెవిన్యూ డివిజన్, ఆపై స్థాయిలో రూ. 10లను దరఖాస్తుతో పాటు విధిగా చెల్లించాలి' అనే నిబంధనలను రద్దు చేయాలి. దేశ వ్యాప్తంగా అన్ని స్థాయిల్లోనూ దారిద్ర్య రేఖకు దిగువగా ఉన్న వారికి ఏ విధంగానైతే ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పిస్తున్నారో అదే విధంగా మిగతా అన్ని వర్గాల వారికి కూడా ఉచితంగానే దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలి. అంతిమంగా సమాచారం కోసం చేసే దరఖాస్తు ప్రక్రియా విధానం అతి సరళంగా ఉండాలి. సెక్షన్ 4(1)(బి) ప్రకారం 17 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించని ప్రభుత్వ సంస్థలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి సమాచారాన్ని వెల్లడించేందుకు తగిన పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. సమాచార కమిషన్‌లలో జరిగే ప్రతి ఒక్క విచారణను వీడియో తీసి దరఖాస్తుదారులకు వాటిని కాంపాక్ట్ డిస్క్ (సిడి) రూపంలో అందించేందుకు సమాచార కమిషన్‌లు తగిన చర్యలను తీసుకోవాలి. విచారణ జరిగిన రోజు సాయంకాలం వరకే దరఖాస్తు దారులకు నిర్ణయ ప్రకటనల (ఆర్డర్) ప్రతులను మాతృభాషల్లో సమాచార కమిషన్ అందించేందుకు తగిన పకడ్బందీ చర్యలను తీసుకోవాలి. అవినీతి రహిత సమాజం కోసం కృషి చేస్తున్న సమాచార హక్కు చట్ట కార్యకర్తలపై, దరఖాస్తుదారులపై సహించని స్వార్థపరశక్తులు దాడులు చేస్తూ అన్యాయంగా వారిని చంపివేస్తున్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి ఘటనలకు ఏ మాత్రం తావు ఇవ్వరాదు. ఇవి ఏ మాత్రం సమంజసం కావు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు తగిన పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. సమాచార హక్కు చట్టం 2005 పకడ్బందీగా అమలు కావడానికి పైన పేర్కొన్న అంశాలు ఎంతగానో దోహదపడుతాయి. అందుకుగాను ప్రభుత్వాలు, సమాచార కమిషన్‌లు తగిన పకడ్బంది చర్యలను తీసుకోవాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. దరఖాస్తుదారులు కోరిన సమాచారం వందశాతం వారికి అందిన రోజున సమాచార హక్కు చట్టం నిజంగా అమలు అవుతున్నట్లుగా భావించవచ్చును. అప్పుడు మాత్రమే ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా వెలుగొందుతున్న సమాచార హక్కు చట్టానికి తగిన సార్థకత లభిస్తుంది.

# బీజేపీ..గిరి మంత్రమా??

శ్రీకాకుళం, అక్టోబరు 23, (న్యూస్ పల్స్) బాబోయి.. బీజేపీకి బుర్ర నిండా ఆలోచనలే. అయితే కాలం కలసిరావడంలేదు కానీ లేకపోతే ఒంటిచేత్తో ఏపీని ఎత్తుకెళ్ళిపోదూ. నిజానికి వార్డు మెంబర్ కూడా ఇపుడు ఏపీలో బీజేపీకి లేదు కానీ ఏకంగా కొండకు వెంట్రుకను పెట్టి ముడివేయాలని చూస్తోంది. ఏపీ సీఎం పీఠానికే గురి పెడుతోంది. ఇక బీజేపీకి బోలెడు ఆలోచనలు ఉన్నాయి. ఏపీలో వైసీపీ వెన్ను విరవాలి అంటే కులం మతం కుడి ఎడమల తేడా లేకుండా ఎడా పెడా వాడేయాలన్నదే బీజేపీ ఆరాటం. అందుకోసం జనసేనను కూడా పక్కన ఉంచుకుని మరీ రాజకీయ వీరంగం వేస్తోంది. బీజేపీకి ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టుంది, కానీ ఏపీలో కాదు, జార్ఖండ్, ఒడిషా లాంటి చోట్ల గిరిజనులను తమ వైపు తిప్పుకుని పొలిటికల్ గా ఎన్నో రకాలైన మ్యాజిక్కులు చేసింది. ఇక ఏపీలో కూడా అదే ప్రయోగం చేయాలనుకుంటోంది. ఏపీలో గిరిజనులు పూర్తిగా వైసీపీ వైపు ఉన్నారు. నాలుగు జిల్లాలు విస్తరించి ఏడు ఎస్టీ సీట్లు ఉంటే మొత్తానికి మొత్తం 2019 ఎన్నికల్లో వైసీపీ గెలుచుకుంది. 2014 ఎన్నికల్లోనూ ఇందులో ఆరు వైసీపీ గెలుచుకుని తన ఆధిపత్యాన్ని చాటుకుంది. ఏజెన్సీ గిరిజనులకు కాంగ్రెస్ పార్టీలోనే ఎక్కువ అనుబంధం. అలా కాంగ్రెస్ పార్టీ నేతగా, ముఖ్యమంత్రిగా వైఎస్సార్ వారు గుండెల్లో దేవుడిగా ముద్ర వేసుకున్నారు. ఇక్కడొక గమ్మత్తు అయిన విషయం చెప్పాలి. గిరిజనులకు ఎవరు ముఖ్యమంత్రులుగా పనిచేసినా తెలియదు. వారు ఫోటోలను తీసుకువెళ్ళి మరీ ఎవరో చెప్పమంటే మాకు తెలియదు అంటారు. కానీ వారికి ఇద్దరు ఫోటోలు మాత్రం బాగా గుర్తుపడతారు. అదే వైఎస్సార్, జగన్. అంటే ఈ ఇద్దరి మీద వారికి ఉన్న ప్రేమ, అభిమానం ఏ రేంజిలో ఉందో అర్థం చేసుకోవాలి. ఇదిలా ఉంటే జగన్ ఏజెన్సీ వస్తే గిరిజనుల స్వాగతం మామూలుగా ఉండదు, పూనకంతో వారు ఊగిపోతారు. ఇక జగన్ బాక్సైట్ తవ్వకాలను రద్దు చేసి వారికి ఇంకా చేరువ అయ్యారు. నిజానికి ఈ బంధాన్ని వేరు చేయడం కష్టమే కానీ బీజేపీ మాత్రం రాజకీయ ప్రయోగం చేస్తోంది. బీజేపీకి విశాఖ సహా ఏజెన్సీ ప్రాంతాల్లో ఓట్లు రాలకపోయినా నోరున్న నేతలు నాయకులుగా ఉన్నారు. వారిలో విశాఖ జిల్లా నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన లోకుల గాంధీ ఒకరు. ఆయన్ని ఇపుడు బీజేపీ ఏకంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని చేసింది. ఆ విధంగా ఆయన్ని ఫోకస్ చేసి ఏజెన్సీ ఓట్ల వేటకు బీజేపీ రెడీ అవుతోంది. ఇక ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ ఆదివాసీలతో ఎపుడూ టచ్ లో ఉంటారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించడం, వారి బాగోగులు చూడడం ద్వారా చేరువ అవుతూ ఉంటారు. ఇపుడు ఇదే మంత్రంతో ఏజెన్సీలో పాగా వేయాలని బీజేపీ చూస్తోంది. ఒక విధంగా ఇది అత్యాశే అయినా అక్కడ ఉన్నది బీజేపీ కాబట్టి అసాధ్యం కాబోదని రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో

# జలాశయాలకు పోటెత్తిన వరద



విజయవాడ, అక్టోబర్ 23, (న్యూస్ పల్స్)రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు నదులు పోటెత్తాయి. రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి, పెన్నా, వంశధార నదుల్లోకి వరదనీరు భారీ ఎత్తున వస్తుండటంతో ఆయా నదులపై ఉన్న రిజర్వాయర్లన్నీ నిండుకుండల్లా వరదనీటితో తొణికిసలాడుతున్నాయి. నెల్లూరు జిల్లాలోని కండలేరు రిజర్వాయరు మినహా మిగిలిన రిజర్వాయర్లు పూర్తిస్థాయి నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే కృష్ణా, గోదావరి, వంశధార నదుల నుంచి 3000 టిఎంసిలకు పైగా వరదనీరు సముద్రం పాలైంది. కృష్ణా నది ఉగ్రరూపం దాల్చింది. శ్రీశైలం డ్యామ్‌లోకి 2 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా... దిగువకు నాగార్జునసాగర్ వైపు దాదాపు 3.5 లక్షల క్యూసెక్కులను అధికారులు వదులుతున్నారు. నాగార్జున సాగర్ రిజర్వాయరులోకి 3.14 లక్షల క్యూసెక్కులు వస్తుండగా... దిగువన పులిచింతల ప్రాజెక్టులోకి 3.21 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టులోకి 3.18 లక్షల క్యూసెక్కులు వస్తుండగా... ప్రకాశం బ్యారేజీ వైపు 3.23 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజీలోకి 4.43 లక్షల క్యూసెక్కులు వస్తుండగా... పంటకాలువల్లోకి 4,328 క్యూసెక్కులను వదిలి 4 లక్షల 44 వేల 640 క్యూసెక్కులను సముద్రంలోకి వదులుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దాదాపు నాలుగున్నర లక్షల క్యూసెక్కులను వదలడంతో దిగువన విజయవాడతోపాటు పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గతేడాది కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ నుంచి 798 టిఎంసిల నీరు సముద్రం పాలుకాగా, ఈ ఏడాది ఆదివారం నాటికే 339 టిఎంసిలు సముద్రం పాలయ్యాయి. గోదావరి నదిలో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి గతేడాది 3,797 టిఎంసిల నీరు సముద్రంపాలు కాగా... ఈ ఏడాది ఇప్పటికే 2,631 టిఎంసిలు సముద్రంలో కలిసిపోయాయి. వంశధార నుంచి గతేడాది 134 టిఎంసిలు సముద్రంలో కలవగా... ఈ ఏడాది ఇప్పటికే 31 టిఎంసిలు వృథాగా సముద్రంలోకి కలిసిపోయాయి. ఈ ఏడాది కృష్ణా, గోదావరి, వంశధార నుంచి 3000 టిఎంసిల నీరు ఇప్పటికే వృథాగా సముద్రంలో కలిసిపోయాయి. పెన్నా నదిపై ఉన్న సోమశిల రిజర్వాయరు పూర్తిస్థాయి నీటి నిల్వ అయిన 78 టిఎంసిలతో కళకళలాడుతుండగా, సోమశిలకు దిగువన ఉన్న కండలేరు రిజర్వాయరు 68 టిఎంసిల పూర్తిస్థాయి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 39 టిఎంసిలతో మాత్రమే ఉంది. పెన్నా నదిలో వరద ప్రవాహం లక్ష క్యూసెక్కులకు పైగా ఉండటంతో కండలేరు రిజర్వాయరు కూడా రెండుమూడు రోజుల్లో పూర్తిస్థాయి నీటి నిల్వలకు చేరుకునే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో సాగునీటిని అందించే అన్ని రిజర్వాయర్లు సామర్థ్యం 960 టిఎంసిలు కాగా ప్రస్తుతం 882 టిఎంసిల నీరు రిజర్వాయర్లలో ఉంది.

# ధరలు పెంచేసి చుక్కలు చూపిస్తున్నవ్యాపారులు

కడప అక్టోబర్ 23, (న్యూస్ పల్స్)పంటలకు ఎరువుల వినియోగం పెరిగిన నేపథ్యంలో వ్యాపారులు ధరలు పెంచేసి చుక్కలు చూపిస్తున్నారు. వరి, పసుపు, చెరుకు, కూరగాయలు ఇతర పంట ఎదుగుదలలో కీలకపాత్ర పోషించే యూరియాను బ్లాక్ మార్కెట్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అధిక వర్షాలకు పత్తి మొక్కలను ఉరక దెబ్బ నుంచి రక్షించుకునేందుకు వ్యవసాయ శాఖ సూచన మేరకు ఎకరాకు 15 కిలోలు పొటాష్, 25 కిలోల యూరియా సిఫారసు చేస్తున్నారు. రైతు లెక్కల్లో పరిశీలిస్తే ఇంతకంటే అధికంగానే వినియోగం ఉంటుంది. జిల్లాలో కుందూ, పెన్నా, కెసి, మైలవరం, గండికోట ప్రాంతాలలో వరి సాగు ఊపందుకుంది. మైదుకూరు, దువ్వూరు మండల పరిధిలో కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. టమోట, మిరప పంట వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. దుక్కిలో ఎరువులు వేస్తున్నారు. ముమ్ముందు వీటి వినియోగం అధికం కానుంది. పంట ఏదైనా తొలి దశలో ఎరువులు అందించాల్సిన అవసరం ఉంటుంది. డిఎపి, కాంప్లెక్స్, పొటాష్, ఫాస్ఫేట్ వంటి ఎరువుల్లో యూరియా కలిపి వాడుతుంటారు. ఇక వేరుపురుగు, కలుపు నివారణ మందుల్లో కలుపుతున్నారు. రైతుల అవసరాన్ని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. గరిష్ఠ అమ్మకం ధరకు మించి విక్రయిస్తున్నారు. 45 కిలోల బస్తాకు రూ.80 అధికంగా పిండుతున్నారు. అవసరం లేని ఇతర ఎరువులు, పురుగు మందులు కొంటేనే అడిగినన్ని యూరియా బస్తాలు ఇస్తామంటూ షరతు పెడుతున్నారు. కంపెనీ విక్రయ కేంద్రాల్లో ఈ పద్ధతి ఉంది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి( సొసైటీ) సంఘాల్లో అరకొరగానే ఎరువులను విక్రయిస్తున్నారు. వీటిల్లో మాత్రం గరిష్ఠ చిల్లర ధరలకే ఇస్తున్నారు. అన్నీ సొసైటీల్లో అందుబాటులో లేక దుకాణాల్లోనే అధిక శాతం కొనుగోలు చేస్తున్నారు. మరోవైపు రైతు భరోసా కేంద్రాల్లో కోరిన వెంటనే ఎరువులు దొరకడం లేదు. రైతులు వ్యాపారుల వద్ద కొనుగోలు చేయాల్సి వస్తోంది. యూరియా తయారీ సంస్థల నుంచి గూడ్స్‌లో వచ్చిన నిల్వలను డీలరుకి ఇన్‌వాయిస్ రేట్లకంటే యూరియాను అధిక ధరకు విక్రయించడంతో ఈ సమస్య తలెత్తిందని వ్యవసాయ శాఖ అధికారులే కొంత మంది బహిరంగ ప్రచారం చేస్తుం డటం గమనార్హం. ఉన్నత స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకు అధికారులకు మా మూళ్లు అందుతుండటంతో చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దస్త్రాల్లో నమోదు చేయకుండా గిడ్డంగుల్లోనే అనదికారికంగా యూరియా బస్తాలు నిల్వ చేస్తున్నారు. సరఫరా దారుడు పత్రాలు ఇవ్వకపోవడంతో అమ్మకాలు నిలిపి వేస్తున్నామని బయటకు చెబుతున్నప్పటికీ వాస్తవాలు వేరుగా ఉంటున్నాయి. సకాలంలో యూరియా వేయకపోతే దిగుబడులు తగ్గిపోతాయని ఆందోళన ఖరీఫ్ సాగు అవసరాలకు సరిపడా యూరియా అందుబాటులో లేకపోవడంతో పలు మండలాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో ఖరీఫ్ సీజన్ ముగిసే నాటికి జిల్లాకు 21వేల టన్నుల వరకు యూరియా సరఫరా అయ్యేది. అయితే ప్రస్తుతం జిల్లాకు డీలర్లు, సహకార సంఘాలు, మార్క్ఫెడ్, రైతు భరోసాల ద్వారా గత వారానికి 9679 టన్నుల మాత్రమే వచ్చినట్లు తెలుస్తున్నది. ఎరువుల కంపెనీల నుంచి ప్రైవేటు దుకాణాలకు స్టాకు రావడం లేదు. అయితే సాగు చేస్తున్న పంట విస్తీర్ణం బట్టి కాకుండా ప్రతి రైతుకు ఒకటి, రెండు (45 కిలోలు) మాత్రమే ఇస్తుండడంపై అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. యూరియా కొరత లేదని

వ్యవసాయాధికారులు చేస్తున్న ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేదని పలువురు రైతులు అంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఇంతవరకు దాదాపు 70 శాతం విస్తీర్ణంలో వరి నాట్లు పూర్తయినట్టు అధికారుల సమాచారం. ఈ తరుణంలో వరి, చెరకుతో పాటు ఉద్యాన పంటలకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది జిల్లాకు తగినంత యూరియా సరఫరా కాలేదు. కరోనా వైరస్..లాక్‌డౌన్ కారణంగా కంపెనీల్లో ఏప్రిల్ నుంచి చాలా కాలంపాటు ఎరువులు ఉత్పత్తి నిలిచిపోయింది. ఆ ప్రభావం ఖరీఫ్ అవసరాలపై పడింది. ప్రైవేటు ఎరువుల దుకాణాలకు యూరియా సరఫరా దాదాపు నిలిచిపోయింది. కేవలం సహకార సంఘాలకు మాత్రమే పరిమితంగా స్టాకు వస్తోంది. అవసరాలకు సరిపడా ఎరు వులు రాకపోవడంతో ఒక్కో రైతుకు ఒక బస్తా మాత్రమే ఇస్తున్నారు. అది కూడా అందరికీ అందడం లేదు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల సరఫరా చేసే అవకాశం ఉన్నప్పటికీ, ముందుగా డబ్బులు కడితే తప్ప ఎరువులు వచ్చే పరిస్థితి లేదు. గ్రోమోర్ కేంద్రాలలో కూడా ఈసారి యూరియా లభించడం లేదు. గత వారంలో జిల్లాలో యూరియా కొరత వాస్తవ పరిస్థితులు గుర్తించేందుకు కమిషనరేట్ నుంచి కమిటి పలు మండలాలలో తనిఖీలు నిర్వహించారు.

# జోరు తగ్గించిన అచ్చెన్నా

శ్రీకాకుళం, అక్టోబరు 23, (న్యూస్ పల్స్)అచ్చెన్నాయుడు సుదీర్ఘమైన రాజకీయ కుటుంబం నుంచి వచ్చారు. ఆ కుటుంబం రాజకీయ మొత్తం తెలుగుదేశం పార్టీతోనే ముడి వేసుకుంది. క్లిష్ట పరిస్థితుల్లోనూ పార్టీని వీడని కుటుంబం వారిది. కింజారపు ఎర్రన్నాయుడు నుంచి రామ్మోహన నాయుడు వరకూ నిబద్ధతతో కూడిన రాజకీయం నడిపారు. ఇతర నేతల్లా పదవుల కోసం పక్క చూపులు చూడలేదు. అదే వారి కుటుంబానికి పాలిటిక్స్ లో కలసి వచ్చిందని చెప్పాలి. అయితే అచ్చెన్నాయుడు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎంపికయిన తర్వాత ఆయనను పార్టీ కేంద్ర కార్యాలయానికే పరిమితం చేశారు. ఆయన ఎక్కడా పర్యటించడానికి వీలులేదు. కనీసం సొంత జిల్లా శ్రీకాకుళంలో కూడా అన్ని నియోజకవర్గాలకు పార్టీ అధినాయకత్వం పర్మిషన్ లేకుండా వెళ్లడానికి వీలు లేదు. కేవలం పార్టీ నాయకత్వం సూచిన కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఇటీవల సీమ ప్రాంతానికి చెందిన కొందరు నేతలు అచ్చెన్నాయుడును ఆహ్వానించేందుకు రాగా ఆయన ఈ విషయం కుండబద్దలు కొట్టేశారు. అచ్చెన్నాయుడుకు తిరుపతి ఉప ఎన్నిక వరకూ చంద్రబాబు కూడా బాగానే గౌరవం ఇచ్చేవారు. ఆ కుటుంబానికి పార్టీతో ఉన్న అనుబంధం కారణంగా, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినందుకు, బీసీ అయినందుకు చంద్రబాబు అచ్చెన్నాయుడుకు పదవి ఇచ్చారు. మరో కారణం మూడు రాజధానుల ప్రతిపాదన రావడంతో ఉత్తరాంధ్రకే తిరిగి రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చేందుకు చంద్రబాబు మొగ్గు చూపడంతో అచ్చెన్నాయుడును వరించింది. తిరుపతి ఉప ఎన్నిక సందర్భంగా లోకేష్ ను, పార్టీని ఉద్దేశించి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు చంద్రబాబుకు ఆగ్రహం తెప్పించాయి. అప్పటి నుంచే అచ్చెన్నకు పగ్గాలు వేశారంటున్నారు.

# సైలెంట్ టూర్ లో చంద్రబాబు



విజయవాడ, అక్టోబరు 23, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఢిల్లీ ఎప్పుడు వెళ్లినా హడావిడి ఉంటుంది. అధికారంలో ఉన్నా లేకపోయినా ఆయన ఢిల్లీ టూర్లు సందడిగా సాగేవి. జాతీయ నేతలతో వరస భేటీలు, జాతీయ మీడియాతో చిట్ చాట్ లు ఇలా చంద్రబాబు ఢిల్లీ ప్రయాణం ఆద్యంతం ఉత్సాహంగా నడిచేది. అయితే ఈసారి అందుకు భిన్నంగా జరుగుతుంది. ఎవరిని కలవాలో తెలియదు. ఎవరు కాదంటారో అర్థంకాని పరిస్థితుల్లో చంద్రబాబు హస్తిన పర్యటన ఉండబోతోంది. దాదాపు నలభై ఏళ్లుగా చంద్రబాబు రాజకీయాల్లో ఉన్నారు. గత మూడు దశాబ్దాలుగా ఆయన జాతీయ నాయకుడి హోదాలో అనేక సార్లు ఢిల్లీకి వచ్చారు. దేవెగౌడను ప్రధాని చేయడంలో అప్పటి ఎన్డీఏ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించడంలో అంతా తానే అయి వ్యవహరించారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకూ వివిధ పార్టీల నేతలు చంద్రబాబుతో సమావేశమయ్యేవారు. చంద్రబాబు వస్తున్నారంటే ఢిల్లీలోని టీడీపీ నేతల హడావిడి మామూలుగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు ఒంటరిగానే ఢిల్లీకి వెళుతున్నారు. అమిత్ షా కలుస్తారో లేదో తెలియదు. రాష్ట్రపతి రమ్మంటారో లేదో అర్థంకాని పరిస్థి?తి. కానీ రాష్ట్రపతి వరకూ అపాయింట్ మెంట్ దొరికే అవకాశాలున్నాయి. ఇందులో ఢిల్లీలో కీలకపదవిలో ఉన్న ఒకాయన హెల్ప్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇంతకీ ఢిల్లీ వెళ్లి చంద్రబాబు ఏం చేయనున్నారన్నది ఆసక్తికరంగా మారనుంది. అమిత్ షాతో కలిసి ఆయనకు ఫిర్యాదు చేసినా ప్రస్తుత పరిస్థితుల్లో ఫలితం ఉండదన్నది చంద్రబాబు కు తెలియంది కాదు. అయితే చంద్రబాబు ఢిల్లీ పర్యటన కొంత ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఏపీ ప్రభుత్వంపై చర్యలు ఆశించకపోయినా, రాజకీయంగా ఆయన బీజేపీకి దగ్గరయ్యే అవకాశానికి ఈ టూర్ ఉపయోగపడనుంది. అదే సమయంలో జాతీయ మీడియాకు జగన్ ప్రభుత్వం తమ పార్టీ పట్ల అనుసరిస్తున్న విధానాలను, వైఫల్యాలను వివరించే అవకాశముంది. అది తప్ప ఢిల్లీ టూర్ ఇప్పటికిప్పుడు చంద్రబాబుకు, ఆయన పార్టీకి పెద్దగా ఉపయోగపడే అవకాశాలు లేవు.

# టీడీపీ నెక్స్ట్ ప్లాన్ ఏంటీ

విజయవాడ, అక్టోబరు 23, (న్యూస్ పల్స్) పార్టీ ఆఫీస్‌పై దాడి ఘటన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఏం చేయబోతోంది? అధికార పార్టీకి ధీటుగా బదులిచ్చేందుకు రెడీ అవుతోందా? వెయిట్ అండ్ సీ ఫార్మూలాను ఫాలో అవుతుందా? మెజార్టీ పార్టీ నేతలు తేల్చుకోవాలనే భావిస్తున్నారు. కానీ అధినే చంద్రబాబు నాయుడు మనసులో ఏముందన్న అంశం రాజకీయ వర్గాల్లో ఆసక్తిరేపుతోంది. పార్టీ ఆఫీస్‌పై మంగళవారంనాటి దాడితో టీడీపీ ఉలిక్కిపడింది. దీనికి నిరసనగా బుధవారంనాడు రాష్ట్ర వ్యాప్త బంద్ చేపట్టింది టీడీపీ. మరుసటి రోజు ఉదయం నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు 36 గం.ల దీక్షకు పూనుకున్నారు. శుక్రవారం రాత్రి 8 గం.లతో చంద్రబాబు దీక్ష ముగిసింది. అటు టీడీపీ నేతలు అధికార పార్టీపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. ఇదేనా ప్రజాస్వామ్యం అంటూ నిలదీసింది. ఇప్పుడా పార్టీలో అంతర్మథనం మొదలైంది. దాడికి బదులివ్వాలా? అధికారం వచ్చే దాకా ఆగాలా అంటూ పార్టీ నేతలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు గంటసేపు కళ్లు మూసుకుంటే వైసీపీ నేతలకు చుక్కలు చూపిస్తామనే దాకా వెళ్లింది సిట్యువేషన్. చంద్రబాబు దీక్షాశిబిరంపై నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత, బోండా ఉమా ఘాటు వ్యాఖ్యలే చేశారు. పార్టీ ఆఫీస్‌పై దాడితో ఓ వర్గం మొత్తం ఊగిపోతోంది. బదులు తీర్చుకోవాల్సిందేనని పట్టుబడుతోంది. మరో బ్యాచ్ చంద్రబాబు ఇప్పటికైనా మారాలంటోంది. ఇన్నాళ్లు ఓపిక పట్టింది చాలని, సహనాన్ని వదిలి సమరమే అనాల్సిన టైమ్ వచ్చిందంటున్నారు. ఇకపై యాక్షన్‌కి రియాక్షన్ ఉండి తీరాల్సిందేనని పట్టుబడుతోంది. నిజానికి ఒక పార్టీ ఆఫీస్‌పై దాడి నెవర్ బిఫోర్ చాప్టర్. తిట్టుడు.. తిప్పికొట్టుడు ఎఫెక్ట్స్ వైసీపీ-టీడీపీల నుంచి నడుస్తూనే ఉన్నాయి. మరోవైపు ఎటాక్ ఎపిసోడ్‌ను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తోంది టీడీపీ. మరీ కాసేపట్లో ముగిసే దీక్ష తర్వాత చంద్రబాబు తదుపరి పరిణామాలు, యాక్షన్ ప్లాన్ ఎలా ఉంటుందన్నది ఆసక్తి రేపుతోంది. ఢిల్లీ వేదికగా వైసీపీ సర్కారుపై పోరాటం చేయాలన్నది కొందరు టీడీపీ నేతల యోచనగా తెలుస్తోంది. దీంతో సీన్ మొత్తం ఢిల్లీకి షిఫ్ట్ కానుంది.

# టిడ్కో గృహాల నిర్మాణం ఒకడుగు ముందుకు

తిరుపతి, అక్టోబర్ 23, (న్యూస్ పల్స్)పేదల ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రారంభించిన టిడ్కో గృహాల నిర్మాణం ఒకడుగు ముందుకు... రెండడుగులు వెనక్కు అన్న చందంగా మారింది. ఇంటి నిర్మాణాలు పూర్తికాకపోవడానికి నిధుల కొరత అడ్డంకిగా మారింది. ఈ ఏడాది లబ్ధిదారులకు టిడ్కో కొంత మేర నిర్మించిన గృహాలు సైతం పంపిణీకి సిద్ధంగా లేనట్లేనని తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల 41 వేల 400 గృహాలు గ్రౌండింగ్ చేయగా... ఇప్పటి వరకు పూర్తయిన గృహాల సంఖ్య 79,184 మాత్రమే. 1,23,832 గృహాలకు సంబంధించి నేటికీ పునాది లెవెల్ (బేస్ మట్టం) స్థాయి దాటలేదు. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయి. గ్రౌండింగ్ స్థాయిలో ఉన్న నిర్మాణాలు పూర్తి చేయాలంటే సుమారు రూ.13,500 కోట్లు అవసరమవుతాయని అంచనా. నిధుల సర్దుబాటు లేకుండా నిర్మాణాలు ముందుకు సాగే అవకాశాలు కనబడటం లేదు. నిధుల లభ్యత కోసం గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల వాటాను ఇన్‌స్టాల్‌మెంట్ల కింద జమ కావాల్సిన సుమారు రూ.4,212 కోట్లను రాబట్టేందుకు ప్రభుత్వం స్పెషల్ క్యాంపెయిన్ చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు పూర్తయిన గృహాలకు సంబంధించి టిడ్కో చెల్లించాల్సిన బకాయిలు రూ.2 వేల కోట్లకు పైగా ఉన్నాయి. నిర్మాణాలకు సరిపడా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ నిధులు విడుదల చేస్తే 2022 జనవరి నాటికి గృహాల నిర్మాణం పూర్తయ్యే అవకాశాలు కనబడుతున్నాయి. రేపోమాపో పూర్తయిన గృహాలను కేటాయిస్తే తమ సొంతింటి కల నెరవేరుతుందనే లబ్ధిదారుల ఆశలు ఇప్పట్లో నెరవేరే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. వైసిపి అధికారంలోకి వచ్చి 16 నెలలైనా లబ్ధిదారుల వాటా చెల్లించిన వారికి గతంలో కేటాయించిన గృహాలు అప్పజెబుతారా? లేదా? అనే అంశంపై ఆందోళన నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పాత లబ్ధిదారులకే గృహాలు కేటాయిస్తామన్న స్పష్టత నివ్వలేదు.

# ఎన్టీఆర్ నాయకత్వంకోరుతున్న యువత

విజయవాడ,అక్టోబరు 23, (న్యూస్ పల్స్) టీడీపీలో బలమైన సామాజిక వర్గం.. కమ్మలు. పార్టీని ఆర్థికంగా ఆదుకోవడంలోను, పదవులు పొందడంలోను, ప్రభుత్వంతో పనులు చేయించుకోవడంలోను, పార్టీ అధినేత చంద్రబాబును కంటికి రెప్పగా కాపాడుకోవడంలోను వారు కీలక పాత్ర పోషించారు. అయితే, ఇప్పుడు వారి మనసు మారిందా ? కొత్త నాయకత్వానికి వారు ఎదురు చూస్తున్నారా ? చంద్రబాబు నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారా ? అంటే.. తాజా పరిణామాలను, వారి వ్యూహాలను గమనిస్తే.. ఔననే అంటున్నారు పరిశీలకులు. వాస్తవానికి టీడీపీలో కమ్మ నాయకులు బడా వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు. వారు ఏరికోరి చంద్రబాబును నాయకుడిని చేశారు.నిజానికి చంద్రబాబు వ్యూహంతో ముందుకు సాగినా.. ఆయన వల్ల లబ్ధిపొందిన వారు కమ్మలే. దీంతో వారంతా నిన్న మొన్నటి వరకు కూడా బాబును ఫాలో అయ్యారు. చంద్రబాబు వారిని కోరినా కోరక పోయినా.. వారంతా బాబుకు మద్దతుగా చక్రం తిప్పారు. కానీ, ఇప్పుడు వారు మార్పు కోరుకుంటున్నారు. చంద్రబాబు తర్వాత పార్టీ పగ్గాలను స్వీకరించేది చిన్నబాబు లోకేషేనని దాదాపుగా ఖరారైన నేపథ్యంలో ఆయన నాయకత్వంలో వీరు పనిచేసేందుకు సుతరాము ఇష్ట పడడం లేదు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్లేస్‌ను రీప్లేస్ చేయగల నాయకుడు ఎవరైనా.. ఏ పార్టీలో ఉన్నా.. బయటకు వస్తే.. తాము మద్దతిస్తామనే ధోరణిలో ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది.ఈ క్రమంలో అందరి చూపూ ఇద్దరు కీలక వ్యక్తులపై ఉందనే ప్రచారం కూడా జరుగుతోంది. కేవలం టీడీపీలో ఉన్న కమ్మలే కాదు.. వైసీపీలో ఉన్న కమ్మలు కూడా కమ్మల్లో సమర్థుడు అయిన నేత దొరికితే చాలు ఆయన నాయకత్వంలో పని చేసేందుకు రెడీగా ఉన్నట్టు కూడా తెలుస్తోంది. గత వారం రోజులుగా ఏపీ రాజకీయాల్లోనూ.. ముఖ్యంగా కమ్మ సామాజిక వర్గంలోని పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తల్లో ఈ ప్రచారం జోరుగా జరుగుతోంది. ఎవరో ఎందుకు ప్రస్తుతం వైసీపీలో ఉన్న మంత్రి కొడాలి నాని విషయానికే వస్తే ఆయన వైసీపీలో ఉన్నప్పటికీ. టీడీపీలోని కమ్మలకు ఆయనంటే ప్రత్యేక అభిమానం. పైగా ఆయన నందమూరి ఫ్యామిలీని ఎప్పుడూ విమర్శించలేదు.ఇలాంటి నేతలు అందరూ చంద్రబాబుకే వ్యతిరేకం? ఈ వర్గంలో మరో బలమై నేత ఎవరైనా వస్తే ఎప్పుడైనా గోడ దూకడంలో పెద్ద ఆశ్చర్యపడాల్సిన పనిలేదన్న టాక్ ఉంది. వాస్తవానికి గత రెండు దశాబ్దాల రాజకీయం చూస్తే కమ్మల వెనక చంద్రబాబు పడ్డాడు అనడం కంటే బాబు వెంటే కమ్మలు నడిచారు. అవి వారి రాజకీయ అవసరాలు కావొచ్చు? వ్యాపార, ఇతరత్రా అవసరాలు కావచ్చు. అయితే ఇప్పుడు ఈ పంథా మారుతోంది. చంద్రబాబుతో నడిస్తే రాజకీయంగానే కాకుండా అన్ని విధాలా నష్టపోవడం ఖాయం అన్న నిర్ణయానికి వచ్చేశారు. ఇక ఇప్పుడు వీరంతా బలమైన కమ్మ నేత కోసం అర్రులు చాచుకుని ఎదురు చూస్తున్నారు.ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ వర్గంలో ఆ స్థాయి నేతలు ఎవ్వరూ లేరు. వీళ్లందరు ఆశలు పెట్టుకున్న ఒకే ఒక వ్యక్తి జూనియర్ ఎన్టీఆర్. ఆయన ప్రస్తుతం సినిమాల్లో ఉన్నారు. ఆయన వచ్చి టీడీపీ పగ్గాలు చేపట్టినా.. పార్టీలో కమ్మ హవా పెరుగుతుందని.. అంటున్నారు. యువత ఎక్కువగా ఎన్టీఆర్ నాయకత్వం కోరుతోంది. అయితే, ఆయన ఇప్పట్లో రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి చూపించకపోవడం గమనార్హం. ఏదేమైనా.. ఒకనాడు చంద్రబాబు మోసిన కమ్మ బోయీలే.. ఇప్పుడు బాబు పల్లకిని దించేస్తామని.. మరో నేత కోసం ఎదురు చూస్తుండడం రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తిని రేపుతోంది. వీరి అంసతృప్తిని తగ్గించేందుకు చంద్రబాబు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారా? లేదా.. ఏమైతే. అది అవుతుందని చూస్తూ.. ఊరుకుంటారా? అనేది ఆసక్తిగా మారింది.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష

### సిపిఐ నాయకులు




నందికొట్కూరు. అక్టోబర్ 23 జిల్లాలోని నందికొట్కూరు నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారని, పంట చేతికి వచ్చి నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గత నెల రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం తగదని హితవు పలికారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే సిపిఐ పార్టీ? ఆధ్వర్యంలో భారీ ఎత్తున రైతులతో కలిసి ఆమరణ దీక్షకు దిగుతామని సిపిఐ జిల్లా నాయకులు రఘురాం మూర్తి, సిపిఐ కార్యదర్శి ఎం. రమేష్ బాబు హెచ్చరిక చేశారు. ఆదివారం స్థానిక మార్కెట్ కార్యాలయం దగ్గర రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ తువ్వా శివ రామ కృష్ణ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల రోజులుగా సిపిఐ ఆధ్వర్యంలో ఇప్పటికే అన్ని మండల కేంద్రాల్లో శాంతియుతంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆందోళన చేశామని అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. ఇప్పటికే నందికొట్కూరు శాసనసభ్యులు ఆర్థర్ కు విన్నవించిన పరిష్కరించకపోవడం తో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వారు అన్నారు. రైతు పంట సాగు చేసే సమయంలో ఎరువుల ధరలు, కూలీల రేట్లు, గుత్త రేట్లు అనేకంగా పెరిగి కష్టనష్టాలతో పంట సాగు చేశారని తీరా పంట చేతికి వచ్చిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం తో దళారీ బారిన పడి దారుణంగా నష్టపోతున్నారన్నారు.. రైతులు గత సంవత్సరం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకున్నారని అదే ఆశతో ఎదురు చూస్తున్నారని వారన్నారు. మొక్కజొన్న క్వింటం ధర పెరిగిన ధరలకు అనుగుణంగా రూ, 2200 అమలు చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నందికొట్కూరు నియోజక వర్గంలో ఆరు మండల కేంద్రంలో మరో రెండు రోజుల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే సిపిఐ ఆధ్వర్యంలో ఆమరణ దీక్షకు పూనుకుటామని వారు అధికారులకు హెచ్చరిక జారీ చేశారు. కలెక్టర్ ,ఎమ్మెల్యే ,నందికొట్కూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు కే శ్రీనివాసులు, ఎం శ్రీనివాసులు, అనీల్, రైతులు రాముడు, సుంకన్న రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ చౌక ధరల దుకాణాల డీలర్లు ఖాళీ గోనెసంచులను ఎంఎల్ఎస్ పాయింట్స్ కి అందజేయాలి




### నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

నంద్యాల అక్టోబర్ 23 ప్రభుత్వ చౌక ధరల దుకాణాల డీలర్లు ఖాళీ గోనెసంచులను ఎంఎల్ఎస్ పాయింట్స్ కి అందజేయాలి అని నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ డీలర్లను ఆదేశించారు.శనివారం నంద్యాల సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ నంద్యాల రెవెన్యూ డివిజన్ లోని ప్రభుత్వ చౌక ధరల దుకాణాల డీలర్లు ఖాళీగోనెసంచులను ఎంఎల్ఎస్ పాయింట్స్ కి అందజేయాలి అని డీలర్లకు ఆదేశించామన్నారు. రేషన్ షాప్ ల డీలర్ లు బియ్యం పంపిణీ చేసిన అనంతరం ఖాళీ సంచులను ఎం ఎల్ ఎస్ పాయింట్స్ కు అందజేయాలన్నారు.దాదాపుగా ఆరు మాసాల నుంచి ఖాళీ బియ్యం సంచులు ఎంఎల్ఎస్ పాయింట్ కు అందజేయాలని రేషన్ షాప్ డీలర్లకు చెబుతున్నా వారు పట్టించుకోవడం లేదన్నారు.ధాన్యం కొనుగోలు చేసేందుకు సంచులు అవసరం ఉన్నందున రేషన్ పంపిణీ పూర్తయిన వెంటనే తిరిగి ఖాళీ సంచులు ఇవ్వాలన్నారు.డీలర్ లు ఖాళీ సంచులు తిరిగి ఇవ్వకపోతే వారికి నోటీసులు జారీ చేసి డీలర్ షిప్ క్యాన్సల్ చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు పర్యవేక్షణ చేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు.

# టీడీపీ కార్యాలయంపై దాడి కేసు..పోలీసులు అదుపులో పదిమంది

గుంటూరు అర్బన్ అక్టోబరు 23, (న్యూస్ పల్స్)టీడీపీ పార్టీ ఆఫీస్ పై దాడికి సంబంధించిన కేసులో పోలీసులు పురోగతి సాధించిరు. దర్యాప్తులో భాగంగా పది మందిని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. పానుగంటి చైతన్య, పల్లపు మహేష్ బాబు, పేరూరి అజయ్, శేషగిరి పవన్ కుమార్, అడపాల గణపతి, షేక్ అబ్దుల్లా, కోమటిపల్లి దుర్గారావు, జోగ రమణ, గోక దుర్గాప్రసాద్, లంక అభి నాయుడు లను అరెస్టు చేసారు. మిగిలిన నిందితులకోసం నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసారు. టిడిపి పార్టీ ఆఫీసు బాధ్యులకు సీసీ ఫూటేజీ కోసం నోటీసులు ఇచ్చారు. అయితే వారు సీసీ ఫుటేజీ ఇవ్వలేదని సమాచారం. ఆ ఫుటేజ్ వచ్చాక దాని ఆధారంగా మిగతా ముద్దాయి లను గుర్తించి అదుపులోకి తీసుకుంటాం. ఈ దాడిలో పాల్గొన్న వారందరును గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

రాజమహేంద్రవరం అక్టోబరు 23, (న్యూస్ పల్స్)రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన ఘటన రాజమహేంద్రవరం ఇస్కాన్ టెంపుల్ సమీపంలో చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి ఆల్కాట్ గార్డెన్స్ గోదావరి గట్టు మీదుగా ద్విచక్రవాహనంపై ఓ యువకుడు, యువతి వేగంగా వస్తున్నారు. వారి వాహనం ఇస్కాన్ ఆలయం సమీపంలో అదుపు తప్పడంతో ఇద్దరు కింద పడ్డారు. ప్రమాదంలో యువకుడుకు తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గాయాలపాలైన యువతిని స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఆమె తనపేరు చాందిని, తనది లింగం పేట అని వైద్య సిబ్బందికి తెలిపింది. ఆ యువకుడు వివరాలు తెలియలేదు. ఆమె కోలుకుంటేనే గానీ పూర్తి వివరాలు చెప్పలేమని పోలీసులు చెబుతున్నారు. టూ టౌన్ పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని యువకుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తిరుపతిలో విషాద ఘటన?.

### నీటిలో మునిగి నవ వధువు దుర్మరణం

తిరుపతి అక్టోబరు 23, (న్యూస్ పల్స్)తిరుపతిలో విషాద ఘటన జరిగింది. భారీ వర్షానికి నీటిలో వాహనం మునగడంతో నవ వధువు దుర్మరణం పాలయింది. కర్ణాటక రాష్ట్రం రాయచూరు నుంచి తిరుమల శ్రీవారి దర్శనార్థం వస్తుండగా తిరుపతి వెస్ట్ చర్చి వద్ద నున్న అండర్ బ్రిడ్జి వద్ద ఈ ఘటన జరిగింది. వెస్ట్ చర్చి వద్ద అండర్ బ్రిడ్జి లోకి భారీగా చేరుకున్న వర్షపు నీటీలో తుపాన్ వాహనం చిక్కుకుంది. ఈ సమయంలో కారులో ఏడుగురు తో ప్రయాణిస్తున్నారు. నవ వధువు సంధ్య మృతి చెందగా, మరో చిన్నారికి అస్వస్థత కలిగింది. చిన్నారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బేబీ పరిస్థితి నిలకడగా వుందని సమాచారం. ఎస్ వి యూనివర్సిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# చంద్రబాబు వుండడం దౌర్భాగ్యం

నెల్లూరు అక్టోబరు 23, (న్యూస్ పల్స్)దౌర్భాగ్యమైన ప్రతిపక్ష నాయకుడు రాష్ట్రం లో ఉండటం దౌర్భాగ్యమని మంత్రి అనిల్ కుమార్ అన్నారు. .చంద్రబాబు నాయుడు ,ఆయన సుపుత్రుడు రాష్ట్ర ముఖ్యమంత్రి ని అనరాని మాటలు అన్నారు.ముఖ్యమంత్రి ని ఆయన తల్లిని విమర్శిస్తే ఉప్పు ,కారం తిన్న వారు ఎవరు చూస్తూ ఉండరు. గుంటూరు జిల్లా లో ఉప్పు ,కారం ఎక్కువగా తింటారు.. కాబట్టి పౌరుషం, రోషం ఎక్కువగా ఉంటాయి.ఒక పక్క గిచ్చడం మరోపక్క మాపై దాడి చేశారు అని దొంగ దీక్షలు చేయడం.అబ్బా, కొడుకులు ఎన్ని దొంగ దీక్షలు చేసినా ఈ రాష్ట్రం లో ఎవ్వరు ఏమి పికలేరు.సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వం డ్రగ్స్ తో ఎపి కి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేసింది.డ్రగ్స్ ను ఎవరు ప్రోత్సహిస్తూన్నారో చూస్తే మీ మూలాలు కనిపిస్తాయి. డ్రగ్స్ తీసుకునే అలవాటు మీకు ఉంటే దాన్ని వైసీపీ పై రుద్దడం దారుణం.ఏ రోజు అయిన ప్రజా సమస్యలపై పోరాటం చేసారా.. కులాల మధ్య చిచ్చు పెట్టడం.. మతాల మధ్య చిచ్చు పెట్టడం తప్ప.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాపై దాడులు జరిగినా ఇక్కడే ఉన్నాం మీలా హైదరాబాద్ లో దాక్కోలేదు.వైఎస్సార్సీపీ కార్యకర్తలను టచ్ కూడా చేయలేరు.ఏబీఎన్ రాధాకృష్ణ కుల పిచ్చి తో కోటుకుంటున్నాడు పిచ్చి రాతలు ఎని రాసిన మా వెంట్రుక కూడా పికలేదని అన్నారు.

# పార్టీ ముఖ్యనేతలతో చంద్రబాబు భేటీ

అమరావతి అక్టోబరు 23, (న్యూస్ పల్స్)తెలుగు దేశం పార్టీ ముఖ్య నేతలతో తన నివాసంలో ఆ పార్టీ అధినేత చంద్రబాబు శనివారం భేటీ అయ్యారు. ఈ సమావేశానికి అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, ఎంపీ కేశినేని నాని పలువురు సీనియర్ నేతలు హజరయ్యారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటన పై సీనియర్ నేతలతో చర్చ జరిగింది. సోమవారం రాష్ట్రపతి ని చంద్రబాబు, నేతలు కలవనున్నారు. రాష్ట్రపతి తో పాటు ఇంకా ఎవరెవరిని కలవాలి అనే దానిపై నేతలతో చర్చ జరిగినట్లు సమాచారం. ఏపీలో రాష్ట్రపతి పాలనకు టీడీపీ డిమాండ్ చేస్తోంది. ఇప్పటికే గవర్నర్ ని కలిసి ఆర్టికల్ 356 పెట్టాలి అని కోరిన విషయం తెలిసిందే.

# రాబిన్ డైరక్షన్ లో టీడీపీ

విజయవాడ, అక్టోబరు 23 పొలిటికల్ స్ట్రాటజిస్ట్. అంటే రాజకీయ వ్యూహకర్త. ప్రస్తుత రాజకీయాల్లో వీరు పోషిస్తున్న పాత్ర మన కళ్లముందున్నదే. పవర్‌ను నిలుపుకునేందుకు అధికారపక్షం, ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రతిపక్షం ఇరుపక్షాలు వీరిపై ఎంతగా ఆధారపడుతున్నాయో మనం చూస్తున్నదే. ప్రశాంత్ కిశోర్.. దేశంలోనే ప్రముఖ రాజకీయ వ్యూహకర్తగా పేరుగాంచిన వ్యక్తి. వైఎస్ఆర్‌సీపీకి రాజకీయ వ్యూహకర్తగా వ్యవహరించి జగన్ ఏ విధంగా అధికారంలోకి వచ్చేందుకు తోడ్పడింది తెలిసిందే. చేతులు కాలాకా ఆకులు పట్టుకున్న చందంగా ఈయన శిష్యుడు రాబిన్ శర్మను టీడీపీ తమ రాజకీయ వ్యూహకర్తగా నియమించుకుంది. గత కొంతకాలంగా రాబిన్ నేతృత్వంలోనే టీడీపీ యాక్షన్ కొనసాగుతుంది. తిరుపతి లోక్‌సభ ఎన్నికల్లో కాస్త యాక్టివ్ అయిన ఆ పార్టీ రాజకీయాలు ప్రస్తుతం ఊపందుకున్నాయి.స్తంభంగా ఉంటే జనాలు తమని మర్చిపోతారనో, ఆ మాత్రం ప్రతిపక్ష హోదా కూడా మిగలదనో లేదా మళ్లా ఎన్నికల సమయానికి కనుమరుగే అవుతామనో భయంతోనో ఏదైతేనేం మొత్తంమీద క్రియాశీలకంగా మారుతున్నారు. రాబిన్ డైరెక్షన్ ప్లాన్‌కు చంద్రబాబు నాయుడు యాక్షన్ దూకుడును జోడించారు. అందుకే ఏ మాత్రం సందు దొరికినా దూసుకుపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఇందుకు పాలనా వైఫల్యాన్ని ఎండగడుతూనో, ప్రజా సమస్యలను నెత్తికొత్తుకునో కాకుండా విమర్శలను ఆలంభనగా చేసుకున్నారు. పాజిటివ్ కంటే నెగెటివ్ జనాల్లోకి తొందరగా వెళ్తుందని ఇందుకు కారణమై ఉండొచ్చు. నేటి సమాచార యుగంలో పాపులర్, అన్‌పాపులర్ కావాలన్న క్షణాల్లో జరిగిపోతుంది. ఒకవైపు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలు, మరోవైపు ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియాతో ఓ అంశాన్ని జనాల్లోకి క్షణాల్లో జొప్పించి చర్చకు పెడుతున్నారు. ప్లస్ అయితేనేం, మైనస్ అయితేనేం మొత్తం మీద మేము క్రియాశీలంగా ఉన్నామంటూ తమ ఉనికి చాటుకుంటున్నారు. పట్టాభి అంశమే ఇందుకు ఉదాహరణగా మనం చూడొచ్చురాబిన్ డైరెక్షన్‌లోనే పట్టాభి సీఎంపై తీవ్ర విమర్శలు చేసినట్లుగా సమాచారం. అనుకున్న విధంగానే వైసీపీ శ్రేణులు స్పందించి ప్రతివిమర్శలు, దాడులు చేశారు. తాము ఆశించిన ఫలితం వచ్చిందన్నట్టుగా చంద్రబాబు వెంటనే రంగంలోకి దిగారు. టీడీపీ కార్యాలయాలపై జరిగిన దాడులపై వెంటనే గవర్నర్‌తో పాటు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖలు రాయడం, 36 గంటల దీక్ష, ఢిల్లీ టూర్ ఇలా వరుసగా దూసుకుపోతున్నారు.

# మున్సిపల్ లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి...



### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబొద్దిన్ పాషా

కోరుట్ల అక్టోబర్ 23 ఎన్నో ఏళ్లుగా మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న అధికార, ఉద్యోగ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబొద్దిన్ పాషా కోరుట్ల నియోజకవర్గ మాజీ యూత్ అధ్యక్షులు రాంప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో లక్షల ఉద్యోగాలను నియామకం చేశామని చెబుతున్నప్పటికీ మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో మాత్రం ఖాళీలు వెక్కిరిస్తున్నాయి అని అన్నారు. ఆ లక్షల ఉద్యోగాల్లో మెట్ పల్లి లో నియామకం చేయడానికి ఆ అవకాశం ఎందుకు లభించలేదని ప్రశ్నించారు. ప్రస్తుతం మెట్ పల్లి మున్సిపల్ కార్యాలయంలో పదుల సంఖ్యలో అధికార, ఉద్యోగ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అన్నారు. కొన్ని ఉద్యోగాలను ఇంచార్జిలతో నెట్టుకొస్తున్నప్పటికి మరి కొన్ని పోస్టులు ఏళ్ళతరబడి భర్తీకి నోచుకోవడం లేదన్నారు. అవసరమైన స్థాయిలో బిల్ కలెక్టర్ల నుంచి, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్, సహాయ పోస్టులు ఇలా అన్ని కీలక విభాగాల్లో అధికారులు, ఉద్యోగుల కొరత ఉ ందని అన్నారు. దీంతో పలు అవసరాల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు వారి వారి పనులు సకాలంలో జరగడం లేదన్నారు. మున్సిపల్ కార్యాలయానికి కీలకంగా ఉండే పన్ను వసూళ్లలో లో అవసరమైన స్థాయిలో సిబ్బంది లేరు అని అన్నారు. దీంతో సుమారు గత పదేళ్లుగా నల్ల బిల్లుల వసూళ్లలో ఎలాంటి స్పష్టత లేదని అన్నారు. ఆస్తిపన్ను వసూళు సైతం లక్ష్యం నెరవేరడం లేదని అన్నారు. ఈ పోస్టులను భర్తీ చేయాలని ఎన్నిసార్లు మొత్తుకుంటున్నా స్థానికంగా పట్టించుకునే నాథుడే కరువయ్యారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ యూత్ జనరల్ సెక్రెటరీ రమేష్ ఎస్సీ సెల్ నాయకులు కంభ సురేష్ నాయకులు పోతు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టాభి ఇంటిపై దాడి 11 మంది అరెస్ట్

విజయవాడ, అక్టోబరు 23 టీడీపీ అధికార ప్రతినిధి, పార్టీ సీనియర్ నేత పట్టాభిరామ్ ఇంటిపై దాడి కేసులో ఇప్పటివరకు 11 మంది అరెస్ట్ చేశామని విజయవాడ సీపీ వెల్లడించారు. పట్టాభి భార్య చందన ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ వేగవంతం చేశామని ఇవాళ విడుదల చేసిన ప్రెస్ నోట్ లో పేర్కొన్నారు. దాడి జరిగిన ప్రాంతంలోని ఆధారాలు, చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఆధారంగా 11 మంది అరెస్ట్ చేసినట్టు తెలిపారు. పట్టాభి ఇంటిలోని సీసీ ఫుటేజీ డీవీఆర్ ఇవ్వమని కోరామని.. డీవీఆర్ అందిన తర్వాత విచారణ మరింత వేగవంతం చేస్తామని సదరు ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, పట్టాభి భార్య చందన ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసిన పడమట పోలీసులు.. రాత్రి పదకొండు మంది నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఆ పదకొండు మంది విజయవాడకు చెందిన వారిగా గుర్తించారు. ఇంటి చుట్టు ప్రక్కల సిసి కెమెరాల ఆధారంగా పదకొండు మందిని గుర్తించామని.. పట్టాభి ఇంట్లో ఉన్న డివిఆర్ ఇచ్చిన తర్వాత మిగిలిన వారిని గుర్తించి అరెస్ట్ చేస్తామని సీపీ శ్రీనివాసులు తెలిపారు.

# ఆ సంఘటన చాలా బాధాకరం...

### - తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి అక్టోబరు 23, (న్యూస్ పల్స్)కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ పెళ్లి బృందం అర్ధ రాత్రి తిరుపతి వెస్ట్ చర్చి వద్ద వరద నీటిలో చిక్కుకుని పెళ్లి కూతురు మృతి చెందడంతో...ఆ ప్రాంతాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పరిశీలించారు. తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీషా కమిషనర్ పీ ఎస్ గిరీషా తో కలిసి శనివారం ఉదయం భూమన చేరుకుని...అధికారుల ద్వారా సంఘటన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో భూమన కరుణాకర రెడ్డి మాట్లాడారు. స్థానిక వెస్ట్ చర్చి వద్ద చోటు చేసుకున్న సంఘటనచాలా బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతిలో మోకాళ్ల లోతు నీళ్లు పోవడమే చాలా కష్టమని, అలాంటిది రాత్రి కురిసిన వర్షానికి అర్ధ గంటలోపే బ్రిడ్జి దగ్గర దాదాపు ఎనిమిది తొమ్మిది అడుగుల పైన నీళ్ళు చేరిపోయాయని తెలిపారు. సరిగ్గా అదే దామయనికి కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒక పెళ్లి బృందం తమ వాహనంలో చేరుకున్నారని... డ్రైవర్ నిర్లక్ష్యం కారణం వాహనంలో ఉన్న పెళ్లికూతురు ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు. ఈ సంఘటన జరిగిన మరో పదిహేను నిమిషాల్లోనే బ్రిడ్జి కింద నీరు వెళ్లిపోవడం జరిగిందని వివరించారు. మీడియా ప్రతినిధులు అడిగిన ఓ ప్రశ్నకు ఎమ్మెల్యే భూమన బదులిస్తూ...గతంలో ఎన్నడూ ఇలాంటి విషాదం చోటు చేసుకోలేదని స్పష్టం చేశారు. భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రత్యేక ప్రణాళికలు చేపడుతామని వెల్లడించారు. ముఖ్యంగా బ్రిడ్జి కింది భాగంలో ఎత్తు పెంచడం , వరద నీటి కాలువల్లో పూడిక తీయించడం వంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతామని భూమన పేర్కొన్నారు.

# వైకాపా హయంలో పెరిగిన భూకబ్జాలు

కడప అక్టోబరు 23, (న్యూస్ పల్స్ కడప జిల్లా బద్వేలు త్యాగరాజు కాలనీలో వైసీపీ నుంచి 150 మంది బీజేపీ లో చేరారు. వారందరికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ బద్వేలు లో భూ కబ్జాలు పెరిగిపోయాయి. నిన్న వైశ్యుల కుటుంబానికి చెందిన స్థలాన్ని వైసీపీ నేతలు కబ్జా చేశారు. వారు నిన్న ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ క్షమాపణ చెప్పాలి. వైసీపీ నేతలు సామాన్యుల స్థలాలు కూడా కబ్జా చేస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసేస్తున్నారు. బద్వేలు లో భూ కబ్జా దారులు రెచ్చిపోతున్నారు. ప్రతిపక్షం లో ఉన్నప్పుడు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చాక తాడేపల్లి గూడెం నుంచి బయటికి రావడం లేదు. ప్రధాని మోడీ వేసిన రోడ్ల పై జగన్ తిరగాలి. పల్లెల్లో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయి. జగన్ పల్లెల్లో రోడ్లు వేయలేదు. మోడీ వేసిన రోడ్లు, జగన్ వేసిన రోడ్లకి చాలా వ్యత్యాసం ఉ ంది. వైసీపీ పాలన తో ప్రజలు విసిగిపోయారని అన్నారు.

## మున్సిపల్ 10వ వార్డు ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, ఓటరు తుది జాబితా విడుదల..



నందికొట్కూరు. అక్టోబర్ 23 ( విభారె) .త్వరలో రానున్న మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో నందికొట్కూరు మున్సిపాలిటీ 10వ వార్డు వారీగా తుది ఓటర్ల జాబితా , పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం ప్రకటించినట్లు మున్సిపల్ కమిషనర్ అంకిరెడ్డి తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీ పట్టణంలో 29 వార్డులు ఉన్నాయి. ఇందులో 10 వ వార్డుకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఈ వార్డు లో మొత్తం 986 మంది ఓటరులు ఉండగా అందులో మహిళలు 498 మంది, పురుషులు 488 మంది ఉన్నారని అధికారులు ప్రకటించారు.ఈ ఏడాది జరిగిన మున్సిపల్ ఎన్నికలలో వైసీపీ పార్టీకి చెందిన తులశమ్మ 10 వ వార్డు కౌన్సిలర్ గా గెలుపొందారు. ఆనంతరం అమేకు ప్రభుత్వ కొలువు రావడంతో అమే కౌన్సిలర్ గా రాజీనామా చేశారు. దీని ప్రభుత్వం ఆమోదించడం తో 10వార్డుకు మళ్ళీ ఉప ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో నందికొట్కూరు మున్సిపాలిటీ అధికారులు తుది ఓటరు జాబితాను, పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రకటించారు.ప్రభుత్వ కార్యాలయాలు, రెవిన్యూ కార్యాలయాలు, వార్డు సచివాలయ కార్యాలయాలలో పోలింగ్ కేంద్రాల జాబితాను, ఓటర్ల జాబితాని సంబంధిత అధికారులు ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెబ్ సైట్ లోనూ జాబితా ఉంచడం జరిగిందని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. నందికొట్కూరు ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లోని 9వ తరగతి రూమును పోలింగ్ కేంద్రానికి కేటాయించినట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బేబీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## మాల మహా ఐక్యవేదిక కార్యాలయం ప్రారంభం

నంద్యాలఅక్టోబర్ 23 ( విభారె) .పట్టణంలోని నూనెపల్లె ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మాల మహా ఐక్యవేదికరాష్ట్ర కార్యాలయంను శనివారం రాష్ట్ర అధ్యక్షులు కొప్పర చిన్న చెన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ అధ్యక్షులు దామోదర్ సంజీవయ్యా సూచన మేరకు కార్యాలయాన్ని ప్రారంభించామన్నారు . డాక్టర్ బాబాసాహెబ్ ఆశయాల సాధన కోసం కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యల కోసం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన కార్యాచరణ సంఘం చైర్మన్ మేకల లింగస్వామి దేవ కుమారి తదితరులు పాల్గొన్నారు

# వ్యర్థాల నిర్మూలన శాస్త్రీయంగా జరగాలి

**జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్, సెషన్స్ జడ్జి డా.వి.రాధాక్రిష్ణ కృపా సాగర్**

**జిల్లాలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి - జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు**

**బయోమెడికల్ వేస్ట్ ను బాధ్యతగా తీసుకొని డిస్పోజల్ చేయాలి - జిల్లా ఎస్పీ సిహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి**

కర్నూలు, అక్టోబర్ 23 ( విభారె) :-జిల్లాలో బయో మెడికల్ వేస్టు నిర్వహణ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా వంద శాతం అమల జరగాలి...ఇందుకోసం పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్డ సెషన్స్ జడ్జి డా.వి.రాధాక్రిష్ణ కృపా సాగర్ అన్నారు.శనివారం ఉదయం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కర్నూలు ఆధ్వర్యంలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ పాన్ ఇండియా అవేర్నేస్ అండ్ ఔట్ రిచ్ ప్రోగ్రాం అవగాహన కార్యక్రమం జరిగింది.అవగాహన కార్యక్రమంలో కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్డ సెషన్స్ జడ్జి డా.వి.రాధాక్రిష్ణ కృపా సాగర్, జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు, జిల్లా ఎస్పీ సిహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ మరియు రైతు భరోసా) రామ సుందర్ రెడ్డి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ శ్రీనివాస రావ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యం.సుబ్బయ్య, డి ఎం యచ్ ఓ డాక్టర్ రామ గిడ్డయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ మునిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్డ సెషన్స్ జడ్జి డా.వి.రాధాక్రిష్ణ కృపా సాగర్ మాట్లాడుతూ....బయోమెడికల్ వేస్ట్ ను చాలా ఆస్పత్రులు ఎక్కడపడితే అక్కడ పడవేయడం వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. జనరేట్ అవుతున్న బయోమెడికల్ వేస్ట్ ను పకడ్బందీగా డిస్పోజల్ చేయాలన్నారు. దీన్ని పూర్తిగా అరికట్టేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. కర్నూలు జిల్లాలో లీగల్ సర్వీస్ అథారిటీ చాలా బాగా పనిచేస్తుందన్నారు. బయో మెడికల్ వేస్ట్ ఎక్కడపడితే అక్కడ పడేయకుండా బాగా డిస్పోజల్ జరిగేలా బార్ కోడింగ్, జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం సమాజంలో ప్లాస్టిక్ వినియోగం మోతాదుకు మించిపోయిందని, దీని వలన వాతావరణ సమతౌల్యం దెబ్బతింటోందని చెప్పారు. దీని దృష్ట్యా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి - జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు :-జిల్లాలో బయోమెడికల్ వేస్ట్ నిర్వహణ మరింత సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు అధికారులను ఆదేశించారు. 1986 లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం రూపంలోకి రావడం జరిగిందని, 2016లో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ లో చేర్పులు, మార్పులు జరిగాయన్నారు. చట్టం రూపంలో చాలా క్లియర్ గా ఎలా డిస్పోజల్ చేయాలి వంటి విషయాలపై పొందుపరచడం జరిగిందన్నారు. జిల్లాలోని హాస్పిటల్, క్లినికల్, ప్రయోగశాలలు, నర్సింగ్ హోమ్ లో బయో మెడికల్ వ్యర్థ పదార్థాలు




ఎక్కువగా జనరేట్ అవుతుందని, ఇవే కాకుండా ఇతరులు కూడా టన్నులకొద్దీ బయోమెడికల్ వేస్ట్ ను జనరేట్ చేస్తున్నారని, కోవిడ్ సమయంలో ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ వినియోగించిన మాస్క్ లను పడేయకుండా...బాధ్యతగా ఉండాలి...బాధ్యతగా డిస్పోజల్ చేయాలన్నారు. బయో మెడికల్ వేస్ట్, ఏ వ్యర్థాలు అయినా సరిగా డిస్పోజల్ చేయాలన్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ చట్టం బాగా అమలులోకి తీసుకు రావాలన్నారు. బయోమెడికల్ వేస్ట్ వల్ల ఎటువంటి పరిస్థితులు దారి తీస్తుందో, పర్యావరణం సమతుల్యత దెబ్బతిని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, ఇప్పటికైనా ప్రతి ఒక్కరూ మేల్కొని వచ్చే తరానికి మంచి వాతావరణం ఇచ్చేందుకు బాధ్యతగా కృషి చేయాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో బయో వ్యర్థ పదార్థాల నిర్వహణకు అవసరమైన పటిష్టమైన చర్యలు ఉండేలా చూడాలన్నారు.

రేపటి నుంచి వేస్ట్ మేనేజ్మెంట్ పై కార్యాచరణ రూపొందించాలన్నారు.బయోమెడికల్ వేస్ట్ ను బాధ్యతగా తీసుకొని డిస్పోజల్ చేయాలి - జిల్లా ఎస్పీ సిహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి :-చాలా ఆస్పత్రులు బయో వేస్టుని ఇష్టారాజ్యంగా పారేస్తోన్నారని, దీనిని పూర్తిగా అరికట్టాలన్నారు. తమ గ్రామంలో ఒక పశువు చనిపోతే, పశువును పోస్టుమార్టం చేస్తే, పశువు శరీరంలో సిరంజన్ లు ఉన్నాయని, తద్వారా పశువు మృతిచెందినట్లు తెలుస్తోందన్నారు. బయో మెడికల్ వేస్ట్ ఓ ప్రాంతంలో వేయడంతో, ఆ ప్రాంతం గడ్డి మొక్కలు మొలవడంతో పశువు గడ్డిలో ఉన్న సిరంజన్ లు, గడ్డితో పాటు మేతగా తీసుకోవడంతో పశువు మృతి చెందిందన్నారు. దీనిని బట్టి చూస్తే ఎంత ప్రమాదకరమో అర్థమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వేస్ట్ మేనేజ్మెంట్ ను బాధ్యతగా తీసుకొని డిస్పోజల్ చేయాలన్నారు. కోవిడ్ తర్వాత మూడింతల బయోమెడికల్ వేస్ట్ పెరిగిందన్నారు. బయోమెడికల్ వేస్ట్ సరిగా డిస్పోజల్ చెయ్యకపోతే చట్ట పరంగా కేసులు కూడా నమోదు చేయవచ్చన్నారు. బయోమెడికల్ వేస్ట్ వల్ల పర్యావరణానికి మరియు జంతువులు, మానవులకు ఏ ప్రాణికి కూడా ఎటువంటి హానీ కలగకుండా ఉండేలా డిస్పోజల్ చేయాలన్నారు.

## కర్నూలు జిల్లాలో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న పాఠ్యశాలలపై చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ గారికి వినతిపత్రం అందజేశారు

**పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగరాజు**



కౌతాళం అక్టోబర్ 23 ( విభారె)కర్నూలు జిల్లాలోని కార్పొరేట్,ప్రైవేట్ విద్యాసంస్థలు నారాయణ, శ్రీ చైతన్య, భాష్యం మరియు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా తమ ఇష్టానుసారంగా ఫీజులను వసూళు చేస్తున్నారని ఆరోపించారు..శనివారంనాడు కడప లోని రాయలసీమ ప్రాంతీయ పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ వెంటక కృష్ణ రెడ్డి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం పి డి ఎస్ యు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఆదోనిలో శ్రీ చైతన్య,భాష్యం,నారాయణ మరియు ప్రైవేట్ పాఠశాలలు తమ ఇష్టానుసారంగా ఫీజులను వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. పాఠ్య పుస్తకాలు,యూనిఫారం ,మరియు స్పెషల్ ఫీజుల పేరుతో తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.ఒకే పాఠశాల గుర్తింపుతో మరో చేస్తున్నారని విమర్శించారు.తక్షణమే ఆ పాఠశాలలపై విచారణ జరిపించి ప్రభుత్వ నిబంధనలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.లేని పక్షంల పి డి ఎస్ యు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా సహాయకార్యదర్శి ఎస్ ఎన్ డి రఫీ,జిల్లా నాయకులు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

## బీసీ కాలనీ కు నూతన పైపులైన్ ఏర్పాటు

తుగ్గలిఅక్టోబర్ 23 ( విభారె) : తుగ్గలి మండల పరిధిలోని మారెళ్ళ గ్రామంలో బీసీ కాలనీ కు శాశ్వత నూతన పైపులైను ఏర్పాటు చేశారు.శనివారం రోజున గ్రామ గౌరవ సలహాదారుడు సుధాకర్ రెడ్డి మరియు పంచాయతీ కార్యదర్శి రాముడు ఆధ్వర్యంలో బి.సి.కాలనీ కు నూతన పైపులైన్ ఏర్పాటు చేసి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపారు.బిసి కాలనీలో నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజల సమస్యల పరిష్కారం కొరకై నూతన పైపులైను ఏర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# లక్ అంటే ఈ హీరోయిన్ దే..!



ఇండస్ట్రీలో కొత్త హీరోయిన్స్ అవకాశాల కోసం ఎంతగా ప్రయత్నాలు చేస్తారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఒక్క అవకాశం దక్కితే మళ్లీ వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు అన్నట్లుగా పరిస్థితి ఉండదు. కొందరు మూడు నాలుగు అయిదు పది సినిమాలు చేసినా కూడా కొత్త ఆఫర్ల కోసం ప్రయత్నించాల్సి ఉంటుంది. కాని కొందరు అదృష్టం మాత్రం వారికి మొదటి సినిమాతోనే ఆఫర్లు తెప్పిస్తుంది. ఉప్పెన హీరోయిన్ కృతి శెట్టికి మొదటి సినిమా విడుదలకు ముందే మంచి ఆఫర్లు వచ్చాయి. ఇప్పుడు అదే తరహాలో పెళ్లి సందడి హీరోయిన్ శ్రీలీలకు కూడా మంచి ఆఫర్లు వస్తున్నాయి. ఈమెకు మొదటి సినిమా విడుదల కాకుండానే ఆఫర్లు వచ్చాయి. రవితేజ.. త్రినాధ రావు నక్కిన ల కాంబోలో రూపొందుతున్న సినిమాలో శ్రీలీల ఆఫర్ దక్కించుకుంది.పెళ్లి సందడి సినిమా సక్సెస్ అయితే అమ్మడి ముందు క్యూ చాంతాడంత ఉండేది. కాని సినిమా ఫ్లాప్ అవ్వడంతో కాస్త తక్కువ అయ్యింది. ఇప్పటికి కూడా ఈ అమ్మడి ముందు ఉన్న ఆఫర్లు తక్కువేం కాదు. కొత్త హీరోల నుండి టైర్ 2 హీరోలు పలువురు ఈమెతో నటించేందుకు ఆసక్తిగా ఉన్నారు. అనధికారికంగా అందుతున్న సమాచారం ప్రకారం ఈమె ముందు ప్రస్తుతం అరడజను సినిమాలు ఉన్నాయట. ఆ సినిమాలన్నింటిని ఈమె ఒప్పుకుంటుందా లేదా అనేది చూడాలి. వచ్చే ప్రతి ఆఫర్ ను ఒప్పుకుని కెరీర్ లో తప్పటడుగులు వేయకుండా ఆచి తూచి ఆఫర్లను సెలక్ట్ చేసుకోవాల్సిన అవసరం ఉంది.ఈ సమయంలో కాస్త అటు ఇటుగా ఆలోచిస్తే ఆమె కెరీర్ ఇబ్బందిలో పడే అవకాశం ఉంది. అందుకే అంది వచ్చిన అదృష్టంను సద్వినియోగం చేసుకునేందుకు ఈ అమ్మడు ప్రయత్నాలు చేస్తోంది. తెలుగులో ఈమెకు వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. మొదటి సినిమా ఫ్లాప్ అయినా కూడా ఇంతగా ఆఫర్లు రావడం అంటే మామూలు విషయం కాదు. అందుకే ఈమెది మామూలు లక్ కాదంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. శ్రీలీల ఈ సమయంలో కాస్త జాగ్రత్తగా కెరీర్ ను ప్లాన్ చేసుకుంటే ఖచ్చితంగా టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా మారడం ఖాయం అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఉప్పెన 2 గురించి బుచ్చిబాబు ఇంట్రెస్టింగ్ కామెంట్స్



మెగా హీరో వైష్ణవ్ తేజ్ ను ఉప్పెన సినిమాతో పరిచయం చేసి.. మొదటి సినిమాతోనే వంద కోట్ల క్లబ్ లో వైష్ణవ్ తేజ్ ను చేర్చిన దర్శకుడు బుచ్చిబాబు. సుకుమార్ శిష్యుడు అయిన బుచ్చిబాబు ఉప్పెన సినిమాతో అనూహ్యంగా టాలీవుడ్ లోకి దూసుకు వచ్చాడు. టాలీవుడ్ లో ఇప్పటి వరకు ఏ హీరో లేదా దర్శకుడి మొదటి సినిమాకు వంద కోట్ల వసూళ్లు వచ్చిన దాఖలాలు లేవు. అలాంటి అరుదైన రికార్డును దక్కించుకున్న బుచ్చి బాబు దృష్టిలో ఉప్పెన 2 కథ ఉన్నట్లుగా చెప్పుకొచ్చాడు. ఉప్పెనకు ముందు ఉప్పెన 2 కథను అనుకున్నట్లుగా తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు.ఉప్పెన సినిమా కథ కు కొనసాగింపుగా ఉండే ఉప్పెన 2 కథ కేవలం పాన్ ఇండియా కథ మాత్రమే కాదని.. అదో పాన్ వరల్డ్ కథ గా ఉంటుందంటూ చెప్పుకొచ్చాడు. గ్లోబల్ కాన్సెప్ట్ అంటూ బుచ్చి బాబు ఉప్పెన 2 పై అంచనాలు భారీగా పెంచేశాడు. ఎప్పుడు ఉంటుంది.. ఎలా ఉంటుంది అనే విషయమై క్లారిటీ ఇవ్వలేదు... కాని ఖచ్చితంగా ఉప్పెన 2 ను గ్లోబల్ మూవీగా తీర్చిదిద్దడం ఖాయం అన్నట్లుగా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. ఇప్పుడు కాకున్నా ముందు ముందు అయినా ఉప్పెన 2 సినిమాను చేస్తానంటున్న బుచ్చి బాబు అంచనాలు అమాంతం పెంచేశాడు.వైష్ణవ్ తో తెరకెక్కించిన మొదటి సినిమా ఉప్పెన తర్వాత బుచ్చి బాబుకు రెండవ సినిమా ఆఫర్ గా ఎన్టీఆర్ ను డైరెక్ట్ చేసే అవకాశం వచ్చిందనే వార్తలు వస్తున్నాయి. బుచ్చి బాబు దర్శకత్వంలో ఎన్టీఆర్ సినిమా ఎప్పుడెప్పుడు ఉంటుందా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గురువు లాగే ఒక మంచి జెన్యూన్.. జీనియస్ డైరెక్టర్ గా బుచ్చి బాబుకు పేరు మొదటి సినిమాతోనే వచ్చింది. కనుక ఖచ్చితంగా బుచ్చి బాబుతో ఎన్టీఆర్ సినిమా చేస్తే తప్పకుండా మంచి సినిమా గా నిలుస్తుందనే నమ్మకం వ్యక్తం అవుతోంది. ఉప్పెన 2 కంటే ముందు ఎన్టీఆర్ తో సినిమా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరి అసలు విషయం ఏంటీ అనేది బుచ్చి బాబు క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# అక్కినేని హీరోకి సాలిడ్ హిట్ పడాల్సిందేనా... ?

అక్కినేని మూడవ తరం ఇపుడు టాలీవుడ్ ని ఏలుతోంది. లెజెండరీ యాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు 1944లో ఇండస్ట్రీలో అడుగుపెట్టి 2014 లో చివరిగా వచ్చిన మనం మూవీ దాకా నటిస్తూనే ఉన్నారు. ఆయన నట జీవితం డెబ్బై ఏళ్ళు ఇక పాతికేళ్ల వయసులో హీరో అయిన నాగార్జున ఆరు పదులలో కూడా జోరు పెంచుతూనే ఉన్నారు. నాగ చైతన్యకు మంచి హీరోగా పేరు వచ్చింది. చేతిలో కొన్ని హిట్లున్నాయి. అఖిల్ విషయానికి వస్తే మొత్తానికి ఫస్ట్ హిట్ దక్కింది. మోస్ట్ ఎలిజబుల్ బ్యాచలర్ మూవీతో బాధ తీరింది. అయితే ఈ క్రెడిట్ మొత్తం అక్కినేని హీరో సొంతమా అంటే అక్కడే జవాబు తేడాగా వస్తోంది. ఈ మూవీలో హీరోయిన్ బుట్ట బొమ్మ పూజా హెగ్డే. ఆమె స్టార్ హీరోయిన్. దాంతో పాటు లక్కీయెస్ట్ హీరోయిన్ అని పేరు.దాంతో పూజా ఉండబట్టే హిట్ అన్న ప్రచారం సాగుతోంది. ఇక గీతా ఆర్ట్స్ బ్యానర్ కి కూడా మరో వైపు క్రెడిట్ కొంత వెళ్తోంది. బొమ్మరిల్లు భాస్కర్ ఈ మూవీ విషయంలో పడ్డ కష్టంతో ఆయనకు కూడా కొంత గుర్తింపు దక్కింది. అఖిల్ డ్యాన్సులు బాగున్నాయి. నటనలో మెచ్యూరిటీ ఉంది ఇలా మార్కులు బాగానే పడ్డా కూడా మొత్తానికి మొత్తం క్రెడిట్ మాత్రం ఇచ్చే సీన్ లేదు అంటున్నారు. దాంతో అఖిల్ చూపు ఏజెంట్ మూవీ మీద ఉందిట. ఈ మూవీ పక్కా మాస్ అప్పీల్ తో చేస్తున్నారు. అఖిల్ కూడా ఇలాంటి రగ్డ్ టైప్ క్యారక్టర్ కోరి మరీ చేస్తున్నాడు. ఇక పక్కా మాస్ యాక్షన్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి చేతిలో పడ్డాడు.దాంతో పాటు టోటల్ మేకోవర్ చేంజి చేసిన సురేందర్ రెడ్డి అఖిల్ ని ఈ దెబ్బతో స్టార్ హీరోగా నిలబెట్టేస్తాడు అంటున్నారు. అక్కినేని ఫ్యామిలీకి మూడు తరాలుగా క్లాస్ ఇమేజ్ గట్టిగానే ఉంది. అప్పట్లో ఏయన్నార్ అయినా తరువాత నాగార్జున అయినా మాస్ మూవీస్ చేశారు. కానీ ఎందుకో మాస్ కంటే క్లాస్ ఇమేజే వారికి ఇచ్చేశారు. దాంతో మూడవ తరంలో ఆ లోటుని తీర్చేది కచ్చితంగా అఖిల్ అనే అంటున్నారు. అఖిల్ కూడా ఏజెంట్ గా సరికొత్త గెటప్ లో ఫ్యాన్స్ ని తెగ హుషార్ తెచ్చిపెడుతున్నారు.ఈ మూవీ షూటింగ్ ని వేగంగా పూర్తి చేసి 2022 సమ్మర్ కి రిలీజ్ చేయాలని చూస్తున్నారు. దాంతో వచ్చే ఏడాది అఖిల్ కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా ఏజెంట్ రాబోతోంది అని అపుడే లెక్కలు వేస్తున్నారు. అంతే కాదు అఖిల్ లోని తీరని దాహాన్ని పూర్తిగా తీర్చేదయమే కాదు అక్కినేని ఫ్యామిలీకి కూడా సరికొత్త మాస్ ఇమేజ్ ని తెచ్చేదిగా ఏజెంట్ ని భావిస్తున్నారు. సాలిడ్ హిట్ తో సత్తా చాటడానికి అక్కినేని హీరో అయితే ఫుల్ కాన్ఫిడెన్స్ తో రెడీ అయిపోయాడు మరి.




# అందరి చూపు.... మ్యాచ్ పైనే

దుబాయ్, అక్టోబరు 23, (న్యూస్ పల్స్)టీ 20 ప్రపంచకప్ 2021 లో అక్టోబర్ 24 న భారత్ వర్సెస్ పాకిస్తాన్ తలపడనున్నాయి. దాదాపు రెండు సంవత్సరాల తర్వాత ఇరు జట్లు ఒకరికొకరితో తలపడనున్నారు. అంతకు ముందు 2019 లో, భారత్ వర్సెస్ పాకిస్తాన్ మధ్య మ్యాచ్ జరిగింది. టీ 20 ప్రపంచకప్‌లో టైటిల్ కోసం ఈ రెండు జట్లు బలమైన పోటీదారులు. 2016 టీ 20 వరల్డ్ కప్ తర్వాత టీ 20 ఫార్మాట్‌లో భారత్, పాకిస్తాన్ రెండూ అత్యుత్తమ ప్రదర్శనలను అందించాయి. గత ఐదేళ్లలో ఇద్దరూ అత్యధిక విజయాలు నమోదు చేశారు. గెలుపు-ఓటముల నిష్పత్తిలో ఆఫ్ఘనిస్తాన్ జట్టు ముందంజలో ఉన్నప్పటికీ, పెద్ద జట్లు ఏవీ కూడా ఇండియా-పాకిస్థాన్‌కి దగ్గరగా లేవు. కాబట్టి టీ 20 వరల్డ్ కప్ 2021 ఫైనల్‌లో ఇండియా వర్సెస్ పాకిస్తాన్ నిజంగా తలపడతాయా? లేదా ఈ జట్లలో ఒకటి ఖచ్చితంగా ఫైనల్ ఆడుతుందా? చూడాలి.2016 టీ 20 ప్రపంచకప్ నుంచి టీమిండియా గెలుపు-ఓటముల నిష్పత్తి రెండుగా నమోదైంది. పాకిస్థాన్ స్కోరు 2.3. ప్రస్తుతం భారత్, పాకిస్తాన్‌లను ఓడించడం చాలా కష్టమైన పని. కానీ, ఈ రెండు జట్లు ప్రపంచ కప్‌లో అద్భుతాలు చేయాల్సిన అవసరం లేదు. 2012 వరల్డ్ కప్‌కు ముందు దక్షిణాఫ్రికా 2010, 2012 మధ్య 16 మ్యాచ్‌ల్లో 11 గెలిచిందని చరిత్ర చెబుతోంది. ఈ జట్టు కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఎవరూ గెలవలేదు. కానీ దక్షిణాఫ్రికా సూపర్ -8 నుంచి బయటపడింది. ఆతరువాత వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 2012 లో వెస్టిండీస్ టైటిల్ గెలుచుకుంది. అయితే వారి గెలుపు-ఓటమి నిష్పత్తి టాప్ -8 జట్లలో రెండవ చెత్తదిగా నిలిచింది. 2012, 2016 మధ్య భారత్ అత్యధిక మ్యాచ్‌లను గెలిచింది. కానీ, సెమీ ఫైనల్స్‌లో ఓడిపోయింది.ప్రపంచ కప్‌కు ముందు దాదాపు అన్ని దేశాలు తమ ప్లేయింగ్ ఎలెవన్‌లో మార్పులు చేయడం నిరంతరం కనిపించింది. తరచుగా సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చారు. వెస్టిండీస్ అతిపెద్ద ఉదాహరణగా నిలిచింది. ఈ జట్టు ఆట ప్రపంచకప్‌లో అద్భుతంగా ఉంది. 2010 టీ 20 ప్రపంచకప్ తర్వాత వెస్టిండీస్ 118 టీ 20 మ్యాచ్‌లు ఆడింది. క్రిస్ గేల్, డ్వేన్ బ్రావో, కీరాన్ పొలార్డ్ వీటిలో 26 మ్యాచుల్లో మాత్రమే కలిసి ఆడారు. వీటిలో 11 మ్యాచ్‌లు ఈ ఏడాదిలో జరిగాయి. ప్రపంచ కప్ జరిగిన సంవత్సరంలో ఈ జట్టు గెలుపు-ఓటమి నిష్పత్తి 1.55 గా ఉంది. ప్రపంచ కప్ జరిగిన సమయంలో గెలుపు-ఓటముల నిష్పత్తి 0.589 గా ఉంది. కానీ, ఇంగ్లండ్-పాకిస్తాన్ ఆట దీనికి భిన్నంగా ఉంటుంది. ఈ రెండు జట్లు ప్రపంచ కప్ లేని సంవత్సరాలలో అద్భుతాలు చేశాయి. కానీ, ప్రపంచ కప్ జరిగే ఏడాదిలో ఈ రెండు టీంల ఆట గాడి తప్పింది.ఇక భారత్ గురించి మాట్లాడితే ప్రపంచ కప్ సంవత్సరాల్లో దాని ప్రదర్శన బాగుంటుంది. ప్రపంచ కప్ లేని సంవత్సరాల్లో టీమిండియా ఆట కొంచెం తక్కువగా ఉంటుంది. ప్రపంచ కప్ ఏడాదిలో భారత్ గెలుపు-ఓటముల నష్టాల నిష్పత్తిని 2.75 గా ఉంచింది. అయితే ప్రపంచ కప్ లేని ఏడాదిలో ఈ సంఖ్య 1.69 గా ఉంది.ప్రపంచ కప్‌కు ముందు ఆస్ట్రేలియా వీలైనంత ఎక్కువ మంది ఆటగాళ్లను ప్రయత్నిస్తుంది. తద్వారా సరైన జోడీని కనుగొనే ప్రయత్నాలు చేసింది. కానీ, ఇప్పటికీ గత రెండు ప్రపంచకప్‌లలో జట్టు విజయం సాధించలేదు. ఈ జట్టు 2014,2016 ప్రపంచ కప్‌లలో ఓడిపోయింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**